## ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం



PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 84, పేజీలు - 08

మంగళవారం, సెప్టెంబర్ 22, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD









# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ సమరం ప్రారంభం



## - ఓటర్ నమోదే ప్రధాన అస్త్రం!

- అర్హత ఉన్న గ్రాడ్యుయేట్లను ఓటర్లుగా చేర్చేందుకు కసరత్తు
- ఎమ్మెల్సీ బరిలో దిగే నేతల ముందస్తు కార్యాచరణ
- ఓటర్ల సమీకరణకు ఇప్పటి నుంచే వ్యూహాలకు పదును

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలో మరో ఆసక్తికరమైన రాజకీయ పోరుకు రణభేరి మోగింది. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల పదవీకాలం మార్చి 2027తో ముగియనుండటంతో, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అధికారికంగా కొత్త ఓటర్ల జాబితా షెడ్యూల్‌ను విడుదల చేశారు. ప్రస్తుత సభ్యులైన సురభి వాణిదేవి , తీన్మార్ మల్లన్న ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ రెండు స్థానాల్లో ఎన్నికల కసరత్తు షురూ కావడంతో అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్, సీనియర్ పట్టభద్రుల పట్టున్న బీజేపీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా వ్యూహాలకు పదును పెడుతున్నారు.

### కొత్తగా ఓటర్ల నమోదు

ఈ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైన మైలురాయి, సెప్టెంబర్ 28న విడుదల కానున్న పబ్లిక్ నోటీస్, ఫారం-18 ద్వారా ఓటర్ల నమోదు ప్రారంభం కావడం. గతంలో ఎంతమంది ఓటర్లు నమోదై ఉన్నప్పటికీ, గ్రాడ్యుయేట్ స్థానాల నిబంధనల ప్రకారం పాత ఓటర్ల జాబితా రద్దవుతుంది. ప్రతిసారి కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిందే. నవంబర్ 6 వరకు ఫారం-18 స్వీకరించి, డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. అంటే, దాదాపు 7 లక్షల మందికి పైగా ఉండే అవకాశం ఉన్న పట్టభద్రుల ఓట్లలో ఎవరు ఎక్కువ మంది నిజమైన మద్దతుదారులను ఫారం-18 నింపి ఓటర్లుగా నమోదు చేయించగలుగుతారో, వారికే పోలింగ్ రోజు సగం విజయం ఖాయమవుతుంది.

### చతుర్ముఖ పోటీ ఖాయం

ఈసారి పట్టభద్రుల సమరం చతుర్ముఖ పోటీని తలపిస్తోంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేపట్టిన

2లో..

# రీ-అరెస్ట్‌కు మేజిస్ట్రేట్ అనుమతి తప్పనిసరి

## - నిబంధనలు ఉల్లంఘించిన పోలీసులపై చర్యలు తప్పవన్న సుప్రీం



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** పౌర హక్కుల పరిరక్షణ, పోలీసుల అధికార దుర్వినియోగానికి చెక్ పెట్టే దిశగా దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సెప్టెంబర్ 21వ తేదీ సోమవారం అత్యంత కీలకమైన, చారిత్రాత్మక తీర్పును వెలువరించింది. సరైన ఆధారాలు లేదా చట్టబద్ధమైన కారణాలు చూపకుండా చేపట్టిన తొలి అరెస్టు రాజ్యాంగ విరుద్ధమని తేలి, నిందితుడు విడుదలైన పక్షంలో.. సదరు వ్యక్తిని మళ్లీ అరెస్ట్ చేసే అధికారం పోలీసులకు నేరుగా ఉండదని కోర్టు తేల్చి చెప్పింది. పోలీసు యంత్రాంగం మళ్లీ ఆ వ్యక్తిని కస్టడీకి తీసుకోవాలంటే సంబంధిత జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ముందస్తు అనుమతి పొంది తీరాల్సిందేనని స్పష్టం చేసింది. జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ అతుల్ చందూర్కర్‌లతో కూడిన ధర్మాసనం ఈ సంచలన

2లో..

# రైతులకు నీళ్లివ్వమంటే అరెస్టులా?

## రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్

- ఎండిపోతున్న పంటలకు నీళ్లివ్వాలని కోరిన రైతులను అరెస్ట్
- సీఎం రేవంత్ రెడ్డిది రాక్షస మనస్తత్వమంటూ తీవ్ర విమర్శ
- అరెస్ట్ చేసిన వారిని విడుదల చేసి, నీళ్లు ఇవ్వాలని డిమాండ్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) జూరాల నుంచి సాగునీరు విడుదల చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని డిమాండ్ చేసిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా బీఆర్ఎస్ నేతలు, రైతుల అక్రమ అరెస్టులపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా మండిపడ్డారు. పంటలు ఎండిపోయి అల్లాడుతున్న రైతులను ఆదుకోవాల్సింది పోయి, మాజీ మంత్రులు నిరంజన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్‌లతో పాటు బీఆర్ఎస్ నేతలు, రైతులను గృహనిర్బంధం చేయడం సీఎం రేవంత్ రాక్షస మనస్తత్వానికి నిదర్శనమని విమర్శించారు.

2లో..

# ఊరికే డైలాగులు మీకు మీరే సర్టిఫికెట్లు

## - డీఎస్సీ అక్రమాలపై జగన్ ట్వీట్!



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఏపీలో డీఎస్సీ అక్రమాల వివాదం రోజురోజుకీ ముదురుతోంది. ఇప్పటికే డీఎస్సీ వివాదంపై వైఎస్సార్సీపీ ఆరోపణలు చేస్తుండటం, దానికి ప్రభుత్వం అధికారులతో కౌంటర్లు ఇప్పించడం, సంతృప్తి చెందని వైఎస్సార్సీపీ మళ్లీ కొత్త ఆరోపణలు చేయడం జరుగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో విజయవాడలో శాప్ కార్యాలయ ముట్టడికి వైసీపీ వెళ్లడం, టీడీపీ క్యాడర్‌తో

2లో..

# దమ్ముంటే అసెంబ్లీకి రండి

## - వైసీపీకి సీఎం చంద్రబాబు ఛాలెంజ్



**అమరావతి (ప్రశ్న న్యూస్)** చిత్తూరు జిల్లా కుప్పం బహిరంగ సభలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వైఎస్సార్‌సీపీ వైఖరిపై తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. తన హయాంలో 14 డీఎస్సీలు నిర్వహించి టీచర్ పోస్టులు భర్తీ చేశామన్నారు. మెగా డీఎస్సీపై ఆరోపణలకు బదులుగా, దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని ఛాలెంజ్ చేశారు. విజయవాడలోని శాప్ కార్యాలయం వద్ద స్వశక్తితో, ప్రతిభతో ఉద్యోగాలు సాధించిన డీఎస్సీ స్పోర్ట్స్ కోటా టీచర్లపై వైసీపీ శ్రేణులు, గొడ్డలి పార్టీ రౌడీలు దాడులకు తెగబడటాన్ని తీవ్రంగా ఖండించారు. గురువులపై దాడులు చేస్తే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదు. టీచర్ల జోలికొస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయి, రౌడీయిజం చేసేవారి తోక కత్తిరిస్తామని సీఎం గట్టిగా హెచ్చరించారు. నాటి పాలనలో పాలకులే రౌడీయిజం చేశారని, చంపడానికి, చావడానికి సిద్ధమని వైసిపి ఎమ్మెల్సీ మాట్లాడటంపై మండిపడ్డారు. మిమ్మల్ని చంపడానికి ఇక్కడ ఎవరూ సిద్ధంగా లేరు, మీరు కూడా చావొద్దు. నేరస్థులకు ఇది ప్లేస్ కాదు, మంచివాళ్లు ఉండే అడ్డా అని హద్దుమీరితే ప్రజలే తరిమికొడతారని స్పష్టం చేశారు.

### చంద్రబాబు అంటే లీకేజీలు ఉండవు..

మెగా డీఎస్సీ నియామకాలపై వైసీపీ నేతలు కావాలనే పచ్చి అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని, సీబీఎన్ హయాంలో నిర్వహించే ఏ పరీక్షలోనూ అవినీతికి గానీ, పేపర్ లీకేజీలకు గానీ తావుండదని చంద్రబాబు తేల్చిచెప్పారు. తన 17 ఏళ్ల పాలనలో 14 సార్లు పారదర్శకంగా డీఎస్సీలు నిర్వహించి లక్షలాది మందికి ఉద్యోగాలు ఇచ్చానని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం రాగానే తొలి సంతకంతో మెగా డీఎస్సీ తెచ్చి 16,000 పైగా టీచర్ పోస్టులను భర్తీ చేస్తే, కోర్టుల్లో 350కి పైగా పిటిషన్లు వేసి అడ్డుకోవాలని చూశారని విమర్శించారు.

2లో..

# ఎల్3లో ఉన్నా.. ఇల్లు కడితే నిధులు!

- అర్హతే ప్రామాణికం.. రాజకీయ జోక్యం, పైరవీలకు నో
- రాయదుర్గంలో ఎకరా రూ.260 కోట్ల భూమిలో పేదలకు ఇందిరమ్మ టవర్స్
- హైదరాబాద్‌లో ప్రతి నియోజకవర్గంలో లక్ష ఇళ్ల నిర్మాణమే లక్ష్యం
- వచ్చే బోనాల నాటికి టవర్స్ పూర్తి చేసేలా పనులు వేగవంతం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఎల్3 కేటగిరీపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. క్షేత్రస్థాయి సర్వేలో అనర్హులుగా గుర్తించి ఎల్3లో చేర్చినప్పటికీ, ఇళ్ల నిర్మాణం ప్రారంభించిన వారికి ప్రత్యేక అనుమతి కల్పించనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ముఖ్యంగా బేస్‌మెంట్ నిర్మాణం పూర్తయిన ఇళ్లకు పథకం కింద నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. అదే సమయంలో మంజూరు పొందినా నిర్మాణం ప్రారంభించని అనర్హుల ఇళ్లను రద్దు చేస్తామని స్పష్టం చేశారు. ఎల్3 జాబితాలో అర్హత లేని వారిని తొలగించి, అర్హులైన వారికి ఇళ్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి చెప్పారు. ఇల్లు లేని ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల నెరవేర్చే వరకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని విడతల వారీగా కొనసాగిస్తామని తెలిపారు.

### పైరవీలకు చెక్

ఇందిరమ్మ టవర్స్ లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి రాజకీయ జోక్యానికి, సిఫార్సులకు తావులేదని పొంగులేటి స్పష్టం చేశారు. లాటరీ విధానంలో పారదర్శకంగా లబ్ధిదారులను

2లో..

# తాతా మధు, నవీన్ రెడ్డికి హైకోర్టులో షాక్

## - స్పీకర్ను దూషించిన కేసులో నోటీసులు జారీ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ ను అసభ్య పదజాలంతో దూషించారనే ఆరోపణల కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిలకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం షాక్ ఇచ్చింది. నాంపల్లి సీనియర్ సివిల్ కోర్టు ఇచ్చిన అరెస్ట్, రిమాండ్ నిరాకరణ ఉత్తర్వులను సవాలు చేస్తూ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు ధర్మాసనం, ఈ వ్యవహారంలో తమ సమాధానాన్ని వివరణాత్మకంగా కౌంటర్ దాఖలు చేయాలని ఇద్దరు ఎమ్మెల్సీలకు అధికారిక నోటీసులు జారీ చేసింది.

2లో..

# 2028 నాటికి కార్బన్ న్యూట్రల్‌గా కుప్పం

## - కుప్పంలో వివిధ పథకాల లబ్ధిదారులతో సీఎం చంద్రబాబు ముఖాముఖి



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన సొంత నియోజకవర్గం కుప్పంలో విస్తృతంగా పర్యటించి, పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష జరిపారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి, క్షేత్రస్థాయిలో వాటి అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలు అందుకుంటున్న

2లో..

# ట్యాంక్‌బండ్ వద్ద తీవ్ర ఉద్రిక్తత

## - పోలీసులతో ఉత్సవ సమితి ఘర్షణ

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై గణేశ్ విగ్రహాల నిమజ్జనం అంశం మరోసారి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. హుస్సేన్‌సాగర్‌లో ట్యాంక్ బండ్ వైపు విగ్రహాల నిమజ్జనానికి అనుమతి లేదంటూ అధికారులు ఏర్పాటు చేసిన ఆంక్షలను వ్యతిరేకిస్తూ భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ఆందోళనకు దిగింది. ఈ క్రమంలో ఉత్సవ సమితి ప్రతినిధులకు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటుచేసుకున్నాయి. దీంతో ట్యాంక్‌బండ్ పరిసరాల్లో హైటెన్షన్ వాతావరణం నెలకొంది.

2లో..



# ఉద్యమ త్యాగానికి రాష్ట్ర ప్రభుత్వం అండ

## - రూ.5 లక్షల సాయం - సీఎం రేవంత్ ఆదేశాలు

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ మలిదశ ఉద్యమంలో పాల్గొని ప్రత్యేక రాష్ట్ర సాధనలో వారి వంతు సేవలు అందించిన పలువురి కుటుంబాలకు ఆర్థిక సాయం అందించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో అదృశ్యమైన మండల రాజు కుటుంబానికి మానవతా దృక్పథంతో రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందించాలని అధికారులను ఆదేశించారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని గొర్లవీడు గ్రామానికి చెందిన మండల సమ్మిరెడ్డి కుమారుడు మండల రాజు ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో 2013 జూన్ 20న అదృశ్యమయ్యారు. ఈ విషయాన్ని భూపాలపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

2లో..



# పోటీ పరీక్షల్లో సిలబస్ మార్పు

## - ప్రకటన విడుదల చేసిన టీజీపీఎస్సీ

2లో..

TELANGANA PUBLIC SERVICE COMMISSION

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ సమరం ప్రారంభం

ఉద్యోగ నియామకాలు, జాబ్ క్యాలెండర్, డిఏ, పెన్షన్ అంశాలను ప్రధాన ప్రచారాస్త్రాలుగా మార్చుకుని నిరుద్యోగులు, ఉద్యోగుల ఓట్లను ఆకర్షించేందుకు ప్లాన్ చేస్తోంది. తమ బలాన్ని నిరూపించుకోవడానికి కాంగ్రెస్ యంత్రాంగం క్షేత్రస్థాయి వరకు ఫారం-18 దరఖాస్తులను చేరవేసి రికార్డు స్థాయిలో ఓటర్లను నమోదు చేయించే పనిలో పడింది. అటు ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ పార్టీకి ఇది అతిపెద్ద అగ్నిపరీక్ష. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల తర్వాత గ్రాడ్యుయేట్ వర్గాల్లో ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తిని, నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ అమలులో జాప్యం వంటి అంశాలను లేవనెత్తి విద్యావంతులను తమ వైపు తిప్పుకోవాలని చూస్తోంది. గతంలో గెలిచిన మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ సీటును నిలబెట్టుకోవడంతో పాటు నల్గొండ-వరంగల్-ఖమ్మంలోనూ బలమైన పోటీ ఇచ్చేందుకు కేటీఆర్, హరీష్ రావులు ప్రత్యేకంగా టీమ్‌లను ఏర్పాటు చేసి ఓటర్ల నమోదు బాధ్యతలను స్థానిక నేతలకు అప్పగిస్తున్నారు.

### బీజేపీ కూడా గట్టిగా పోటీ పడే ప్రయత్నం

మరోవైపు హైదరాబాద్, రంగారెడ్డి మరియు నల్గొండ పట్టభద్రుల స్థానాల్లో బీజేపీకి సంప్రదాయంగా బలమైన ఓటు బ్యాంకు ఉంది. విద్యావంతులు, ఐటీ నిపుణులు, ఆర్ఎస్ఎస్ అనుబంధ వర్గాల్లో ఆ పార్టీకి మంచి పట్టు ఉంది. కేంద్రంలో అధికారంలో ఉన్న మైలేజ్‌తో పాటు రాష్ట్ర సర్కార్ వైఫల్యాలను ఎండగడుతూ అర్బన్ ప్రాంతాల్లో అత్యధికంగా ఆన్‌లైన్ ద్వారా ఓట్లను నమోదు చేయించే వ్యూహంతో బీజేపీ సమాయత్తమవుతోంది. దీనికి తోడు తీన్మార్ మల్లన్న, ఇతర స్వతంత్ర, యువజన సంఘాల నాయకులు కూడా బరిలోకి దిగుతుండటంతో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు అత్యంత ఉత్కంఠభరితంగా మారనుంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయానికి 'అభ్యర్థి ఇమేజ్' ఎంత ముఖ్యమో 'ఓటర్ల నమోదు డిజైన్' అంతకంటే వెయ్యింతలు ముఖ్యం. డిగ్రీ సర్టిఫికేట్లు సేకరించి, గెజిటెడ్ అటెస్టేషన్ చేయించి, గడువులోగా ఫారం-18 అధికారులకు చేరేలా ఏ పార్టీ యంత్రాంగం నెట్‌వర్క్‌ను పక్కాగా నడుపుతుందో ఆ పార్టీయే మార్చి 2027 పట్టభద్రుల పోరులో విజేతగా నిలుస్తుంది.

# రీ-అరెస్ట్‌కు మేజిస్ట్రేట్ అనుమతి తప్పనిసరి

ఉత్తర్వులను జారీ చేసింది.

### ఆర్టికల్ 22(1) ఉల్లంఘిస్తే పోలీసులపై శాఖాపరమైన చర్యలు!

రాజ్యాంగంలోని ఆర్టికల్ 22(1) ప్రకారం ప్రతీ పౌరుడికి తన అరెస్టుకు గల కారణాలను లిఖితపూర్వకంగా తెలుసుకునే ప్రాథమిక హక్కు ఉందని ధర్మాసనం పునరుద్ఘాటించింది. నేరం తీవ్రతతో సంబంధం లేకుండా యూఏపీఏ, పీఎంఎల్ఏ వంటి కఠినమైన ప్రత్యేక చట్టాల కింద నమోదైన కేసులకు కూడా ఈ రాజ్యాంగ నిబంధన పవిత్రమైనదని, తప్పనిసరిగా పాటించాల్సిందేనని పేర్కొంది. ఒకవేళ ఆర్టికల్ 22(1) ఉల్లంఘనకు గురై నిందితుడు విడుదల అయితే మళ్లీ అరెస్ట్ చేయడానికి మేజిస్ట్రేట్‌కు దరఖాస్తు చేసుకునే ముందు సదరు నిందితుడికి అరెస్ట్ కారణాలను రాతపూర్వకంగా అందించాలని చెప్పింది.అలాగే మొదట నిబంధనలకు విరుద్ధంగా అరెస్ట్ చేసిన పోలీసు అధికారి తక్షణ పైఅధికారి ఆ దరఖాస్తుపై ఆమోద సంతకం చేయాల్సి ఉంటుందని కోర్టు నిబంధన విధించింది. అంతేకాకుండా ఆర్టికల్ 22(1)ను ఉల్లంఘించి మొదటి అరెస్టుకు బాధ్యుడైన పోలీసు అధికారిపై విధిగా శాఖాపరమైన క్రమశిక్షణా చర్యలు ప్రారంభించాలని ఆదేశించింది.రాజ్యాంగాన్ని ఉల్లంఘించిన అధికారి చేతిలోనే మళ్లీ అరెస్ట్ చేసే విచక్షణాధికారాన్ని వదిలేయకూడదని, దానిని న్యాయపరంగా నియంత్రించాల్సిన అవసరం ఉందో అని జస్టిస్ భూయాన్ వ్యాఖ్యానించారు. మేజిస్ట్రేట్‌కు సమర్పించే పిటిషన్‌లో మొదటిసారి అరెస్ట్ చేసినప్పుడు నిందితుడికి కారణాలు ఎందుకు తెలపలేకపోయారో సహేతుకంగా వివరించాల్సి ఉంటుంది. దరఖాస్తును పరిశీలించిన మేజిస్ట్రేట్ పోలీసులు తెలిపిన విన్నపం నిజాయితీతో కూడుకున్నదని భావించి, తదనంతర కాలంలో నిందితుడికి కారణాలు అందించబడ్డాయని, అతడిని మళ్లీ అరెస్ట్ చేయడం అత్యవసరమని సంతృప్తి చెందితేనే రీ-అరెస్ట్‌కు అనుమతినిచ్చే ఉత్తర్వులు జారీ చేస్తారు. అలాగే ప్రధాన కారణంగా ఆర్టికల్ 22(1) ఉల్లంఘన జరిగిన సందర్భాల్లో ఆ కేసుకు సంబంధించిన తదుపరి విచారణ బాధ్యతలను సదరు పాత అధికారి నుంచి తప్పించి, మరొక అధికారికి అప్పగించాలని సుప్రీం కోర్టు తన తీర్పులో స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది.

# దమ్ముంటే అసెంబ్లీకి రండి

చట్టబద్ధమైన నియామక ప్రక్రియ ముగిసిన ఏడాది తర్వాత బురద చల్లడం దారుణం అన్నారు. దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని, సాక్ష్యాధారాలతో సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉన్నామని సీఎం చంద్రబాబు సవాల్ విసిరారు.వైసీపీ హయాంలో క్రీడలు నిర్వహించి సర్టిఫికెట్లు ఇచ్చి, ఇప్పుడు తమ ప్రభుత్వంలో అవే సర్టిఫికెట్లతో ఉద్యోగాలు వస్తే ఫేక్ అనడం విడ్డూరంగా ఉందన్నారు. చివరకు ఆర్మీలో పనిచేసి కుప్పంలో టీచర్‌గా ఎంపికైన ఒక మాజీ సైనికుడిని స్కూలు నుంచి బయటకు పిలిచి ఓ ఛానల్ రిపోర్టర్ అవమానించడాన్ని ఎండగట్టారు. టీచర్లను కంటికి రెప్పలా కాపాడుకుంటామని, రౌడీయిజం, సైకో సంస్కృతికి కుప్పం గడ్డపై స్థానం లేదని చంద్రబాబు తేల్చిచెప్పారు.చిత్తూరు జిల్లా కుప్పం పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ వైఖరిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గొడ్డలి పార్టీ నాయకులకు క్రమంగా మైకం, పూనకాలు వస్తున్నాయని అయితే వారి బెదిరింపులు లేదా అవాకులు చవాకులు తమ వద్ద సాగవని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వ హయాంలో చేపడుతున్న పారదర్శక నియామకాలపై అబద్ధాలు ప్రచారం చేయడం మాని, ధైర్యముంటే గత వైసీపీ ప్రభుత్వంలో సాగిన 'జే-బ్రాండ్ల' మద్యం దందాపై, ఏపీపీఎస్సీ నియామకాల్లో జరిగిన తీవ్ర అక్రమాలపై అసెంబ్లీ వేదికగా సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు.గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్‌సీపీకి కేవలం 11 స్థానాలు మాత్రమే కట్టబెట్టి, కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా చేశారని చంద్రబాబు ఎద్దేవా చేశారు. ఆ పార్టీ అనుసరిస్తున్న విధ్వంసకర రాజకీయాలకు, దాడులకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ఆయన స్పష్టం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గొడ్డలి పార్టీకి ఒక్క సీటు కూడా రాకుండా ప్రజలు తిరస్కరించినప్పుడే వారి ఆరోపణలకు సరైన, నిజమైన సమాధానం లభిస్తుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## ఊరికే డైలాగులు

# మీకు మీరే సర్టిఫికెటు

దాన్ని అడ్డుకోవడం, ఈ సందర్భంగా పోలీసులు కేసులు నమోదు చేయడం చకచకా జరిగిపోయాయి. ఈ నేపథ్యంలో వైసీపీ అధినేత జగన్ దీనిపై మరోసారి ఘాటుగా ట్వీట్ పెట్టారు.డీఎస్సీ స్కాంపై సీబీఐ విచారణ వేయాలని అడిగితే, ఎందుకంత భయం? ఎందుకంత ఉక్రోషం? పారదర్శకంగా జరిగాయంటూ మీరు, మీ కొడుకు, విద్యాశాఖ మంత్రి లోకేష్, మీకు మీరే సర్టిఫికెట్ ఇచ్చుకుంటారా? అంటూ సీఎం చంద్రబాబును జగన్ ప్రశ్నించారు. స్కాంలు చేసిన వాళ్లే తమకు తాముగా ఇచ్చుకునే సర్టిఫికెట్లకు విలువ ఏముంటుంది? ఊరికే డైలాగులు కొట్టడం ఎందుకు? దమ్ముంటే సీబీఐ విచారణకు ఒప్పుకోండి అన్నారు. విజయవాడలో ఘటనలు చూస్తే మీ ప్రభుత్వం ఎంతగా దిగజారిపోయిందో అర్థమవుతోందన్నారు.

సీబీఐ విచారణ జరిపించాలని కోరుతూ విద్యార్థులు, నిరుద్యోగులతో కలిసి మా పార్టీ నాయకులు శాంతియుతంగా ర్యాలీ చేసేందుకు వెళ్తే వారిని అడ్డుకున్నారు, లాఠీలతో కొట్టించారు, టీచర్ల ముసుగులో మీ రౌడీలతో దాడులు చేయించారు, ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షానికి ర్యాలీలు చేసే హక్కు కూడా లేదా చంద్రబాబుగారూ? అని ప్రశ్నించారు.డీఎస్సీలో మీరు స్కామ్‌లు చేశారు కాబట్టే, ఆ అక్రమాలపై ప్రశ్నిస్తూ మిమ్మల్ని, మీ అబ్బాయిని, బట్టలిప్పి కడిగేస్తున్నారు కాబట్టే, సమాధానాలు చెప్పలేక, తట్టుకోలేక ఇంతగా దిగజారిపోయి వ్యవహరిస్తున్నారని జగన్ విమర్శించారు ఏదో స్కాం చేసి దొరికినప్పుడల్లా తప్పించుకోవడానికి డైవర్షన్లు చేయడం మీకు అలవాటే, మీ బుద్ధే అంత అన్నారు. లక్షలాది మంది అభ్యర్థుల భవిష్యత్తుతో ముడిపడిన డీఎస్సీ నియామకాల్లో జరిగిన అక్రమాలపై నిష్పాక్షికంగా సీబీఐ విచారణ కోరుతున్నామని, ఎలాంటి తప్పూ జరగలేదని మీకు అంత నమ్మకం ఉంటే విచారణకు ఎందుకు వెనుకాడుతున్నారని ప్రశ్నించారు. పైపెచ్చు ఇన్ని ఆధారాలు కనబడుతున్నప్పుడు అని అడిగారు. మీ పోలీసుల బారికేడ్లు, మీ లాఠీఛార్జిలు, అరెస్టులు, కౌంటర్‌గా మీరు పెట్టించిన ఫేక్ ధర్నాలు పోయిన ఆ విశ్వాసాన్ని తీసుకు వస్తాయా? కేవలం సీబీఐ చేత జరిగే నిష్పాక్షిక విచారణ మాత్రమే ఆ విశ్వాసాన్ని తిరిగి తీసుకు రాగలదన్నారు. పోలీసులను అడ్డుపెట్టుకుని స్కాంను దాచేయలేరన్నారు.

## జూనియర్ డాక్టర్ల స్టైపెండ్ పెంచుతూ

# ఉత్తర్వులు జారీ

**అమరావతి** జూనియర్ డాక్టర్లకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. స్టైపెండ్ పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఎంబీబీఎస్, బీడీఎస్ విద్యార్థులకు 10 శాతం, పీజీ వైద్య విద్యార్థులకు 5 శాతం, సూపర్ స్పెషాలిటీ వైద్య విద్యార్థులకు 3.5 శాతం స్టైపెండ్ పెంచింది. ఈ నిర్ణయంతో ప్రభుత్వంపై రూ.34.08 కోట్ల అదనపు భారం పడనుంది.

# రైతులకు నీళ్లివ్వమంటే అరెస్టులా?

జూరాల ప్రాజెక్టులో 9 టీఎంసీల నీరు ఉన్నప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం నీటిని విడుదల చేయకుండా పచ్చని పంటల ఉసురు తీస్తోందని కేటీఆర్ ఆరోపించారు. జూరాల ప్రాజెక్టు పరిసరాల్లో బారికేడ్లు ఏర్పాటు చేసి వందలాది పోలీసులతో రైతులను అడ్డుకోవడం సిగ్గుమాలిన చర్య అని ధ్వజమెత్తారు. తన పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే సీఎం రేవంత్ రెడ్డి ముందస్తు అరెస్టులకు ఆదేశాలిచ్చారని విమర్శించారు. అరెస్టయిన బీఆర్ఎస్ నేతలను, రైతులను తక్షణమే విడుదల చేయాలని, అలాగే జూరాల ఆయకట్టుకు వెంటనే సాగునీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

### జూరాల ప్రాజెక్ట్ వద్ద తీవ్ర ఉద్రిక్తత..

జోగులాంబ గద్వాల జిల్లాలోని ఇందిరా ప్రియదర్శిని జూరాల ప్రాజెక్ట్ పరిసర ప్రాంతాల్లో మరోసారి ఉద్రిక్తత చోటుచేసుకుంది. సాగునీటి విడుదల కోసం రైతులు, బీఆర్ఎస్ నేతలు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. లక్షలాది ఎకరాల్లో వేసిన పంటలు నీళ్లు లేక కళ్లముందే ఎండిపోతున్నాయంటూ వందలాది మంది రైతులు జూరాల ప్రాజెక్ట్‌ను ముట్టడించారు. అధికారుల విజ్ఞప్తులను పక్కనబెట్టి, ఆగ్రహంతో ఊగిపోయిన రైతులు ఏకంగా ప్రాజెక్ట్ హెడ్ రెగ్యులేటర్ తాళాలను బద్దలు కొట్టి, ఎడమ కాలువ గేట్లను ఎత్తి సాగునీటిని విడుదల చేశారు. మూడు రోజుల కిందటే ఇదే సీన్ రిపీట్ కాగా, పోలీసు బలగాలతో రంగంలోకి దిగిన అధికారులు నీటి విడుదలను నిలిపివేశారు. తాజాగా మరోసారి రైతులు జూరాల ప్రాజెక్టుకు చేరుకుని తమ పంటపొలాల్ని కాపాడుకునేందుకు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేసుకోగా, అప్రమత్తమైన ఇరిగేషన్ అధికారులు మళ్లీ నీటి విడుదలను నిలిపివేయడంతో ప్రాజెక్ట్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ నేతలు, మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ శ్రేణులు జూరాల వైపు బయలుదేరడంతో పోలీసులు వారిని ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. చంద్రబాబు తన నియోజకవర్గం కుప్పంకు కృష్ణా నీళ్లు సైతం తీసుకెళ్తుంటే సీఎం రేవంత్ రెడ్డి మాత్రం జిల్లాలోనే ఉన్న జూరాల నుంచి పాలమూరు రైతులకు నీళ్లు ఇవ్వలేకపోతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో కాలువలకు నీళ్లు ఇచ్చి ఆయకట్టును కాపాడేవారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నీటి ప్రాధాన్యతను మర్చిపోయి పంటలను ఎండబెడుతోందని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి జూరాల ఎడమ, కుడి కాలువలకు సాగునీటిని విడుదల చేయకపోతే గద్వాల కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని, పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని రైతు సంఘాల నాయకులు హెచ్చరించారు.

# 2028 నాటికి కార్బన్ న్యూట్రల్‌గా కుప్పం

లబ్ధిదారులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. తల్లికి వందనం, స్త్రీశక్తి, అన్నదాత సుఖీభవ, ఎన్టీఆర్ భరోసా వంటి పథకాల ద్వారా అందుతున్న ప్రయోజనాలు, వాటితో కుటుంబంలో వచ్చిన ఆర్థిక మార్పుల గురించి లబ్ధిదారులను సీఎం అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా, కుప్పంలోని యువ పారిశ్రామికవేత్తలతో సమావేశమై వారికి ప్రభుత్వ ప్రోత్సాహంపై భరోసా ఇచ్చారు. పైలట్ ప్రాజెక్టుగా అమలవుతున్న సంజీవని సేవల లబ్ధిదారులతో మాట్లాడి, పథకం పనితీరుపై ఆరా తీశారు. త్వరలోనే ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "ప్రతి పేద కుటుంబానికి అండగా నిలవాలనే లక్ష్యంతో, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే మా ప్రభుత్వ ధ్యేయం" అని స్పష్టం చేశారు.

### అభివృద్ధి పనులపై సమీక్ష, అధికారులకు ఆదేశాలు

కుప్పంలో జరుగుతున్న మౌలిక వసతుల కల్పనపై స్థానికులతో సీఎం చర్చించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, సీసీ రోడ్లు, తాగునీటి సరఫరా వంటి అంశాలపై ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. జల్ జీవన్ మిషన్ పనుల కోసం కొత్త రోడ్లు వేయడానికి ముందే పైప్‌లైన్లు వేయాలని, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటి స్ట్రీట్ లైటింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

### కుప్పం దేశానికే ఆదర్శం

"2028 నాటికి కుప్పం నియోజకవర్గాన్ని కార్బన్ న్యూట్రల్‌గా మార్చడమే లక్ష్యం. ఈ ఏడాది డిసెంబరు నాటికి ప్రతి ఇంటిపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేయాలి. వ్యర్థాలను సంపదగా మార్చి, పచ్చదనాన్ని 80 శాతానికి పెంచి కుప్పాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలి" అని చంద్రబాబు పిలుపునిచ్చారు. వ్యవసాయ వ్యయం తగ్గించి, రైతుల ఆదాయం పెంచేందుకు ప్రణాళికలు రచిస్తామని, పర్యాటకంగానూ కుప్పాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. జీరో పావర్టీ కార్యక్రమంలో భాగంగా 2026 డిసెంబరు నాటికి నియోజకవర్గంలోని 8,904 'బంగారు కుటుంబాలను' ఆర్థికంగా ఆదుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు.

# పోటీ పరీక్షల్లో సిలబస్ మార్పు

**- ప్రకటన విడుదల చేసిన టీజీపీఎస్సీ**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) కీలక స్పష్టతనిచ్చింది. పోటీ పరీక్షల సిలబస్‌లో మార్పులు చేస్తారంటూ గత కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో వస్తున్న వదంతులకు కమిషన్ తెరదించింది. సిలబస్ మార్పుపై అభ్యర్థుల నెలకొన్న ఆందోళనలు, వారి నుంచి వెల్లువెత్తుతున్న వినతుల నేపథ్యంలో టీజీపీఎస్సీ ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. సిలబస్ సమీక్ష కోసం ప్రస్తుతానికి ఎలాంటి కమిటీని ఏర్పాటు చేయలేదని టీజీపీఎస్సీ కార్యదర్శి స్పష్టం చేశారు. భవిష్యత్తులో పోటీ పరీక్షల సిలబస్‌లో ఏవైనా భారీ మార్పులు చేపట్టాల్సి వస్తే, ఆ విషయాన్ని కనీసం ఏడాది ముందే అభ్యర్థులకు తెలియజేస్తామని హామీ ఇచ్చారు. తద్వారా అభ్యర్థులు మారిన సిలబస్‌కు అనుగుణంగా సిద్ధమవడానికి తగిన సమయం లభిస్తుందని పేర్కొన్నారు. అదేవిధంగా, ఏవైనా స్వల్ప మార్పులు లేదా చేర్పులు అవసరమైతే, ఆ వివరాలను సంబంధిత ఉద్యోగ నియామక నోటిఫికేషన్‌తో పాటే వెల్లడిస్తామని వివరించారు. సిలబస్ మార్పుపై అభ్యర్థులు అనవసరంగా ఆందోళన చెందవద్దని, అసత్య ప్రచారాలను నమ్మవద్దని ఈ సందర్భంగా సూచించారు. కమిషన్ ఇచ్చిన ఈ స్పష్టతతో లక్షలాది మంది నిరుద్యోగ అభ్యర్థులకు ఊరట లభించినట్లయింది.

# చంద్రప్రభపై మురళీ కృష్ణుడి వైభవం

### వర్షంలోనూ ఘటాటోపంలో దర్శనమిచ్చిన శ్రీవారు..

### భక్తుల గోవింద నామస్మరణ



తిరుమల(ప్రశ్న న్యూస్) శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఏడో రోజు సోమవారం రాత్రి చంద్రప్రభ వాహనంపై శ్రీమలయప్పస్వామివారు మురళీకృష్ణుడి అలంకారంలో భక్తులను కటాక్షించారు. వాహనసేవ సమయంలో వర్షం కురిసినా.. ఘటాటోపంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. చంద్రప్రభ వాహనంపై మురళీకృష్ణుడి అలంకారంలో కొలువుదీరిన స్వామివారిని దర్శించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా తిరుమాడ వీధుల్లో వేచిచూసిన భక్తులు స్వామివారి దర్శనంతో భక్తిపారవశ్యంలో మునిగిపోయారు.

### సకల తాపహరం.. చంద్రప్రభ

చంద్రుడు శివునికి శిరోభూషణంగా ఉంటే.. శ్రీహరికి వాహనంగా ఉండటం చంద్రప్రభ వాహన విశిష్టతగా చెబుతారు. చంద్రప్రభ వాహనంపై శ్రీమలయప్పస్వామివారిని దర్శించగానే భక్తుల మనసు ఉప్పొంగుతుందని, హృదయాల్లో ఆనందం వెల్లివిరుస్తుందని ఆధ్యాత్మిక విశ్వాసం.ఆధ్యాత్మిక, ఆదిభౌతిక, ఆదిదైవికమనే మూడు తాపాలను తొలగించే సకలతాపహరంగా చంద్రప్రభ వాహనాన్ని భక్తులు భావిస్తారు. మురళీకృష్ణుడి అలంకారంలో చంద్రప్రభపై విహరించిన శ్రీమలయప్పస్వామివారి దర్శనం బ్రహ్మోత్సవాల్లో మరో ఆధ్యాత్మిక వైభవాన్ని ఆవిష్కరించింది.వాహనసేవలో శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి, సీవీఎస్వో మురళీకృష్ణ, పలువురు బోర్డు సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

# ఎల్3లో ఉన్నా.. ఇల్లు కడితే నిధులు!

ఎంపిక చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ హౌసింగ్ బోర్డు కూడా క్యూర్ పరిధిలో లాటరీ ద్వారా ఎంపిక చేసిన వివరాలను బహిరంగపరిచి, అభ్యంతరాలను స్వీకరిస్తోందన్నారు.

### రూ.260 కోట్ల భూమిలో పేదల ఇళ్లు

ఎకరా రూ.260 కోట్ల వరకు విలువ చేసే రాయదుర్గం వంటి ప్రాంతాల్లో పేదల కోసం ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తున్నామని మంత్రి తెలిపారు. రద్దీ, ఖరీదైన ప్రాంతాల్లోనూ బహుళ అంతస్తుల భవనాలు నిర్మించి పేదలకు ఇళ్లు అందిస్తున్నామని చెప్పారు. లబ్ధిదారుల రిజిస్ట్రేషన్ ఛార్జీలను కూడా ప్రభుత్వమే భరిస్తుందని వెల్లడించారు.

### నాణ్యతపై రాజీ లేదు

ఇందిరమ్మ టవర్స్ నిర్మాణంలో నాణ్యత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని మంత్రి స్పష్టం చేశారు. లబ్ధిదారులు వారానికి ఒకసారి నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించి పనులను పరిశీలించాలని సూచించారు. లోపాలు కనిపిస్తే అక్కడి అధికారుల దృష్టికి తీసుకురావాలని, సమస్యలను పరిష్కరించే బాధ్యత ప్రభుత్వానిదేనని తెలిపారు.

### బీఆర్ఎస్‌పై పొంగులేటి ఫైర్

గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో ప్రజలను మోసం చేసిందని పొంగులేటి విమర్శించారు. అధికారం కోల్పోయిన తర్వాత బీఆర్ఎస్ నేతలు పేదల వద్దకు వచ్చి మొసలి కన్నీరు కారుస్తున్నారని ఆరోపించారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే 2028 అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్‌కు వస్తాయని వ్యాఖ్యానించారు. రాయదుర్గం మల్కం చెరువు వెనుక 2.85 ఎకరాల స్థలంలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, హౌసింగ్ బోర్డు ఎండీ వీపీ గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

# తాతా మధు, నవీన్ రెడ్డికి హైకోర్టులో షాక్

విచారణ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగేశ్వరరావు కోర్టు ఎదుట వాదనలు వినిపిస్తూ, రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిలో ఉన్న వ్యక్తిని బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు అత్యంత అనుచిత పదజాలంతో దూషించడమే కాకుండా విధులు నిర్వర్తిస్తున్న పోలీసు అధికారులపై కూడా దాడులకు తెగబడ్డారని తెలిపారు. వీరిద్దరి అరెస్టును, రిమాండ్‌ను అడ్డుకుంటూ నాంపల్లి కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేయాలని కోరారు. ఇరు వర్గాల ప్రాథమిక నివేదికలను పరిశీలించిన హైకోర్టు, తదుపరి స్పష్టత కోసం ఎమ్మెల్సీల కౌంటర్ దాఖలుకు ఆదేశిస్తూ తదుపరి విచారణను ఎల్లుండికి వాయిదా వేసింది.

### గతంలో ష్యూరిటీ సమర్పించాలని ఆదేశాలు

స్పీకర్ గడ్డం ప్రసాద్పై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఓఎస్డీ వెంకటేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు వీరిద్దరిపై ఎస్టీ, ఎస్సీ చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. అనంతరం ఇద్దరికి వైద్య పరీక్షలు నిర్వహించిన తర్వాత నాంపల్లి కోర్టులో హాజరు పరిచారు. ఇరువర్గాల వాదనలను విన్న న్యాయమూర్తి, పోలీసుల రిమాండ్ విజ్ఞప్తిని తోసిపుచ్చారు. నిందితులు ఇద్దరూ చెరో పదివేల చొప్పున పూచీకత్తుతో పాటు రెండేసి ష్యూరిటీలను సమర్పించాలని ఆదేశించింది.

### తీర్మానానికి అసంబ్లీ ఆమోదం

గతంలో సభాపతి గౌరవాన్ని భంగం కలిగించే వ్యాఖ్యలు చేసిన తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిపై క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు చేస్తూ చేసిన తీర్మానానికి అసెంబ్లీ ఆమోదం తెలిపింది. అలాగే వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తీర్మానం ప్రతిపాదించారు. స్పీకర్పై తాతా మధు, నవీన్‌కుమార్ రెడ్డి దూషణలను సభ తీవ్రంగా ఖండిస్తోందని, సభా మర్యాదలకు విరుద్ధమైన వ్యాఖ్యలపై నిరసన తెలుపుతూ మహిళల ఎదుట అసభ్యకరంగా ప్రవర్తించడాన్ని ఖండిస్తోందని సభ తెలిపింది. బీఆర్ఎస్ సభ్యుల అనుచిత ప్రవర్తలను ఆ పార్టీ అధినేత కేసీఆర్ బాధ్యత తీసుకోవాలని, శాసనసభాపతికి కేసీఆర్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని, నిబంధనలకు అనుగుణంగా మండలి ఛైర్మన్ చర్యలు తీసుకోవాలని శాసనసభ తీర్మానం చేసింది. రాజ్యాంగపరమైన అత్యున్నత పదవిలో ఉండి కూడా అవమానం ఎదుర్కోవాల్సి రావటం బాధాకరమని దామోదర రాజనర్సింహ వ్యాఖ్యానించారు. ఇద్దరు మండలి సభ్యులపైనా క్రమశిక్షణా చర్యలకు సిఫార్సు చేస్తూ తీర్మానించారు.

# ఉద్యమ త్యాగానికి రాష్ట్ర ప్రభుత్వం అండ

లేఖ ద్వారా సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు.తెలంగాణ ఉద్యమంలో మండల రాజు చురుకుగా పాల్గొన్నారని ఆ లేఖలో తెలియజేశారు. ఈ క్రమంలో ఆయన అరెస్టై చర్లపల్లి కేంద్ర కారాగారంలో నిర్బంధించబడ్డారని, ఆ తర్వాత కాలంలో అదృశ్యమయ్యాడని చెప్పారు.

మండల రాజు తన వృద్ధ తల్లిదండ్రులకు ఏకైక కుమారుడని, ప్రస్తుతం వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, రోజువారీ జీవనోపాధికి ఎలాంటి ఆధారం లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ విషయం తన దృష్టికి రావడంతో సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. మండల సమ్మి రెడ్డికి రూ. 5 లక్షలు ఆర్థిక సాయం మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు.

### లింగాల కేదారి కుటుంబానికి రూ. 10 లక్షల ఆర్థిక సాయం...

తెలంగాణ మలిదశ ఉద్యమంలో అంకితభావంతో సేవలందించిన హనుమకొండకు చెందిన కేదారి ఫుడ్ కోర్టు నిర్వాహకులు కేదారి, పుష్పలత దంపతుల ఇటీవల మరణించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే కేదారి, పుష్పలత దంపతుల కటుంబానికి కూడా సీఎం రేవంత్ రెడ్డి ఆర్థిక సాయం ప్రకటించారు. ఆ దంపతుల కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి రూ. 10 లక్షల ఆర్థిక సాయం అందించాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. తెలంగాణ మలిదశ ఉద్యమ సమయంలో లింగాల కేదారి, పుష్పలత అంకితభావంతో అందించిన సేవలను సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు.ఇక, హనుమకొండలోని శాంతినగర్ పోస్టల్ కాలనీకి చెందిన లింగాల కేదారి, పుష్పలత దంపతులు ఒక సాధారణ హోటల్ నడుపుతూ జీవనం సాగించారు.

అయితే అన్నం పరబ్రహ్మ స్వరూపమని, వృథా చేయకూడదని అవగాహన కల్పిస్తూ, సమాజం పట్ల ఎంతో బాధ్యతగా నడుచుకున్నారు. ఉద్యమ సమయంలో వీరు ఉచితంగా భోజనం, టిఫిన్లు, టీలు అందించారు. కేదారి దంపతులు 2026 సెప్టెంబర్‌లో ఒక విషాదకర సంఘటనలో మృతి చెందారు. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు వారి కుటుంబాన్ని ఆదుకోవడానికి సీఎంఆర్ఎఫ్ నుంచి సీఎం ఓఎస్డీ రూ. 10 లక్షల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేశారు. మంజూరైన ఆర్థిక సాయాన్ని అర్హులైన చట్టబద్ధ వారసులు, కుటుంబ సభ్యులకు అందించేలా చర్యలు తీసుకోవాలని హనుమకొండ కలెక్టర్‌ను ఆదేశించారు.

# ట్యాంక్‌బండ్ వద్ద తీవ్ర ఉద్రిక్తత

వివరాల్లోకి వెళితే ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనాలకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఉత్సవ సమితి ప్రతినిధులు అక్కడ బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసిన కొన్ని బారికేడ్లను తొలగించేందుకు ప్రయత్నించారు. వారిని పోలీసులు అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.ఈ తోపులాటలో కొందరు పోలీసులు కిందపడిపోయినట్లు సమాచారం.

అప్రమత్తమైన ఉన్నతాధికారులు అదనపు బలగాలను మోహరించి పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. మరోవైపు తెలంగాణ హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగానే పర్యావరణ పరిరక్షణ కోసం హుస్సేన్‌సాగర్‌లో, ముఖ్యంగా ట్యాంక్‌బండ్‌పై ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ) విగ్రహాల నిమజ్జనాన్ని నియంత్రిస్తున్నట్లు జీహెచ్ఎంసీ, పోలీసు అధికారులు స్పష్టం చేసారు. ఇందులో భాగంగానే ట్యాంక్‌బండ్‌పై నుంచి విగ్రహాలను నేరుగా సాగర్‌లో వేయకుండా 10 అడుగుల రైలింగ్‌ను ఏర్పాటు చేశారు.

ఇక్కడ నిమజ్జనం నిషిద్ధమంటూ ఫ్లెక్సీలను కూడా పెట్టారు. అయితే, ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించింది. ఎన్టీఆర్ మార్గ్, పీపుల్స్ ప్లాజా, నెక్లెస్ రోడ్ ప్రాంతాల్లో మట్టి, పర్యావరణ హిత విగ్రహాల నిమజ్జనం కోసం క్రేన్లను సిద్ధం చేస్తున్నారు. పీఓపీ విగ్రహాల కోసం ప్రత్యేకంగా కృత్రిమ కొలనులను (బేబీ పాండ్స్) ఏర్పాటు చేస్తున్నారు.అయినప్పటికీ ఈ ఏర్పాట్లను భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి తీవ్రంగా వ్యతిరేకిస్తోంది.

ట్యాంక్‌బండ్ అనేది సంప్రదాయ నిమజ్జన ప్రాంతమని, అక్కడే కార్యక్రమానికి అనుమతించాలని డిమాండ్ చేస్తోంది. ప్రభుత్వం ఏర్పాట్లు చేయకపోతే తామే సొంతంగా క్రేన్లు తెచ్చి నిమజ్జనాలు చేస్తామని ఆదివారమే హెచ్చరించింది.
మొత్తంమీద ఒకవైపు కోర్టు ఆదేశాలు, పర్యావరణ పరిరక్షణ నిబంధనలు, మరోవైపు సంప్రదాయం పేరుతో ఉత్సవ సమితి పట్టుదల మధ్య హైదరాబాద్ గణేశ్ నిమజ్జనం అంశం మరోసారి వివాదాస్పదంగా మారింది. ఈ ప్రతిష్ఠంభన ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందోనని నగరవాసుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

# ప్రజావాణి అర్జీలను వెంటనే పరిష్కరించాలి

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి**



మేడ్చల్( ప్రశ్న న్యూస్ ) ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన అర్జీలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా నిబంధనల ప్రకారం వెంటనే పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి తో కలిసి కలెక్టర్ అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ, పంచాయతీ రాజ్, సివిల్ సప్లైస్, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించి మొత్తం 106 దరఖాస్తులు ప్రజల నుండి స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బాధితుల సమస్యలకు ప్రాధాన్యతనిచ్చి వేగంగా పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టరు సూచించారు.ఈ సమావేశంలో డిఆర్ఓ మాలతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# డ్రోన్ నిఘా.. నేరాలపై కన్ను

**కాశీబుగ్గ-పలాస జంట నగరాల్లో పోలీసుల ప్రత్యేక నిఘా**

**నిర్మానుష్య ప్రాంతాలు, పాడుబడిన ఇళ్లపైనా ఏరియల్ నిఘా**

**మద్యం, గంజాయి, పేకాట, జూదం, ఈవ్‌టీజింగ్‌పై ఉక్కుపాదం**

**- కాశీబుగ్గ డీఎస్పీ టి. భవాని**



పలాస(ప్రశ్న న్యూస్) నేరాల నియంత్రణకు సాంకేతికతను జోడించారు పోలీసులు. కాశీబుగ్గ--పలాస జంట నగరాల పరిధిలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. పట్టణాలతో పాటు శివారు ప్రాంతాలు, నిర్మానుష్య ప్రదేశాలు, పాడుబడిన ఇళ్లను డ్రోన్‌ల ద్వారా పరిశీలిస్తున్నట్లు కాశీబుగ్గ డీఎస్పీ టి. భవాని తెలిపారు.సోమవారం నిర్వహించిన ప్రత్యేక నిఘా చర్యల్లో భాగంగా డ్రోన్ కెమెరాలతో ఆయా ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించినట్లు పేర్కొన్నారు.జంట నగరాల్లోని ప్రధాన ప్రాంతాలతోపాటు నేరాలకు అవకాశం ఉన్న పట్టణ శివార్లు, గ్రామీణ ప్రాంతాల చివరి ప్రాంతాలు, నిర్మానుష్య ప్రదేశాలు, పాడుబడిన ఇళ్లను గుర్తించి డ్రోన్‌లతో నిఘా కొనసాగిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. సాధారణ పోలీసు గస్తీకి అందని ప్రాంతాల్లోనూ నిరంతర పర్యవేక్షణకు ఈ విధానం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, గంజాయి వినియోగం వంటి కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. పేకాట, జూదం, ఈవ్‌టీజింగ్, చైన్ స్నాచింగ్ తదితర నేరాలకు పాల్పడే వారిని గుర్తించేందుకు డ్రోన్ నిఘాను వినియోగిస్తున్నట్లు వివరించారు.ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే ప్రాంతాలను గుర్తించి, అక్కడ పోలీసు గస్తీని మరింత పెంచుతామని తెలిపారు.డ్రోన్ నిఘాలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు గుర్తించిన వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ భవాని హెచ్చరించారు. ప్రజల భద్రతకు భంగం కలిగించే ఏ చర్యనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.సాధారణ గస్తీతోపాటు డ్రోన్ కెమెరాల వినియోగంతో నేరాల నియంత్రణకు చర్యలు చేపడుతున్నామని పోలీసులు తెలిపారు. నేరాలకు ఆస్కారం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి నిఘా పెంచడం ద్వారా అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకునేలా చర్యలు కొనసాగుతాయని వెల్లడించారు.

# చందవరంలో వైసీపీకి గుడ్‌బై.. టీడీపీలోకి 10 కుటుంబాలు

**గొట్టిపాటి లక్ష్మి సమక్షంలో పసుపు కండువాలు**




దొనకొండ(ప్రశ్న న్యూస్) దర్శి నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరుతున్నాయి. తాజాగా దొనకొండ మండలం చందవరం గ్రామానికి చెందిన పది వైసీపీ కుటుంబాలు ఆ పార్టీకి రాజీనామా చేసి టీడీపీలో చేరాయి. దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి సమక్షంలో జరిగిన కార్యక్రమంలో పార్టీలో చేరిన వారికి పసుపు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఈ చేరిక కార్యక్రమం జరిగింది. దీంతో గ్రామంలో టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది చందవరం గ్రామానికి చెందిన వైసీపీ కుటుంబాల ప్రతినిధులు టీడీపీలో చేరుతున్నట్లు ప్రకటించిన అనంతరం డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి వారికి పార్టీ కండువాలు కప్పారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి కలిసి పనిచేయాలని సూచించినట్లు నాయకులు తెలిపారు.దొనకొండ మండలంలో పార్టీ కార్యకలాపాలను విస్తృతం చేస్తూ, గ్రామస్థాయిలో నాయకులు, కార్యకర్తలతో సమన్వయంతో ముందుకు సాగుతున్నామని టీడీపీ వర్గాలు పేర్కొన్నాయి. స్థానిక నాయకులు, కార్యకర్తలు కొత్తగా చేరిన కుటుంబాలకు పార్టీ తరఫున అండగా ఉంటామని పేర్కొన్నారు.

# జాఫర్‌గూడలో వైభవంగా గణేష్ నిమజ్జన వేడుకలు





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) అంబేద్కర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు ముఖ్య అతిథిగా 'అంతర్ముఖం' హీరో డా. గంగి మల్లేష్ రాంపల్లి దయారా, జాఫర్‌గూడ: విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి నామస్మరణతో జాఫర్‌గూడ కాలనీ ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. రాంపల్లి దయారలోని జాఫర్‌గూడ కాలనీలో అంబేద్కర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణేష్ నిమజ్జన వేడుకలను భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. గణపతి బప్పా మోరియా.. జై బోలో గణేష్ మహారాజ్‌కీ జై అనే నినాదాలతో కాలనీ వీధులు మార్మోగాయి. భక్తుల ఆనందోత్సాహాల మధ్య గణనాథుడికి వీడ్కోలు పలికిన ఈ వేడుకలు భక్తి, ఐక్యత, సామాజిక సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలిచాయి.ఈ కార్యక్రమానికి 'అంతర్ముఖం' సినిమా హీరో, మిస్టర్ ఇండియా ఇంటర్నేషనల్ 2025 విజేత, మాజీ సర్పంచ్ డా. గంగి మల్లేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు పొందారు. ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలగాలని, ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలని భక్తిపూర్వకంగా ప్రార్థించారు. వినాయక చవితి ఉత్సవాలు భక్తి, ఆధ్యాత్మికతతో పాటు సామాజిక ఐక్యతను పెంపొందించే గొప్ప సంప్రదాయంగా కొనసాగుతున్నాయి. ఒకే చోట చేరి పూజలు నిర్వహించడం, సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం, నిమజ్జన వేడుకల్లో కలిసిమెలిసి పాల్గొనడం ద్వారా ప్రజల మధ్య స్నేహభావం మరింత బలపడుతుంది.జాఫర్‌గూడ కాలనీలో అంబేద్కర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ నిమజ్జన వేడుకలు భక్తి ప్రపత్తులతో పాటు సామూహిక ఆనందానికి వేదికగా నిలిచాయి. గణనాథుడి ఆశీస్సులతో కాలనీ ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని, సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, ఐక్యత వర్ధిల్లాలని భక్తులు ఆకాంక్షించారు.

## జగన్ ఇంటిని ముట్టడించిన నిరుద్యోగ వెటర్నరీ డాక్టర్లు

**తాడేపల్లి** నిరుద్యోగ వెటర్నరీ డాక్టర్లు సోమవారం నాడు తాడేపల్లిలోని మాజీ సీఎం ఎమ్మెల్యే వైఎస్ జగన్ నివాసం ముట్టడించారు. 164 వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీపై వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తుందని ఆరోపించారు. వైసీపీ తప్పుడు ప్రచారాలను నిరసిస్తూ నిరుద్యోగ వెటర్నరీ డాక్టర్ల ఆందోళనకు దిగారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టు కూడా భర్తీ చేయలేదని నిరుద్యోగ వెటర్నరీ డాక్టర్లు విమర్శలు గుప్పించారు. .

# వైసీపీ నేతల అల్లర్లను ఖండించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

**అమరావతి**ంశాప్ కార్యాలయం వద్ద వైసీపీ నేతల అల్లర్లను మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. దేవినేని అవినాష్, జోగి రమేష్ రౌడీ గ్యాంగ్ తో శాప్ కార్యాలయం వద్ద రాళ్లు, కోడిగుడ్లతో అల్లర్లకు పాల్పడిన ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. ప్రభుత్వ కార్యాలయాన్ని చుట్టుముట్టి ఉపాధ్యాయులపై దాడికి యత్నించడం హేయమైన చర్య. డీఎస్సీ స్పోర్ట్స్ కోటా టీచర్లపై దౌర్జన్యం చేయడం దుర్మార్గం. కష్టపడి ఉద్యోగాలు సాధించిన క్రీడాకారులు, ఉపాధ్యాయులను అవమానించడం సరికాదని అన్నారు.

ఉపాధ్యాయులపై దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్య పద్ధతి కాదు. శాంతియుతంగా తమ సమస్యలను చెప్పుకునే అవకాశం ఉన్నా.. ప్రభుత్వ కార్యాలయం వద్ద ఉద్రిక్తత సృష్టించడం తగదు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద అల్లర్లు, దాడులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదు. ఉపాధ్యాయులపై దాడులకు పాల్పడిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించడం వైసీపీ నేతల విజ్ఞతకే వదిలేస్తున్నామని అన్నారు.

# రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



**చిట్వేలి** ఛిట్వేలి మండల పరిధిలో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలు, పంటలకు గిట్టుబాటు ధరలు, ఎరువుల కొరత, పంటల బీమా తదితర సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పందికాళ్ల మణి డిమాండ్ చేశారు. సోమవారం చిట్వేలి మండల తహసీల్దార్ నరసింహారావు కు రైతులతో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మణి మాట్లాడుతూ ఎరువుల కోసం వివిధ యాప్‌లను తప్పనిసరి చేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. భూములు ఉన్నప్పటికీ ఈ-కేవైసీ, వేలిముద్ర, ఆధార్ లింక్ తదితర కారణాలతో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ వంటి సంక్షేమ పథకాలు పలువురు రైతులకు అందడం లేదన్నారు. రైతుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. రైతుల పంట రుణాలను మాఫీ చేయాలని, పంటలకు ప్రభుత్వమే గిట్టుబాటు ధర కల్పించాలని, కౌలు రైతులను ఆదుకోవాలని, ఎరువులకు సంబంధించిన యాప్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 22-ఏ భూ సమస్యలను పరిష్కరించడంతో పాటు భూములు ఉన్న ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాలు వర్తింపజేయాలని కోరారు. గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించి రోజుకు రూ.600 కూలి ఇవ్వాలని, సాగునీటి ప్రాజెక్టులు నిర్మించాలని, పశువులకు ఉచితంగా మేత అందించాలని, బొప్పాయి రైతులకు సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి శంకరయ్య, ఒలిమి నాగయ్య, వేమన తిరుపయ్య, జ్యోతి నాగేష్‌తో పాటు రైతులు సుబ్బరాయుడు, చలపతి, రాజు, మారే ఉదయ్‌కుమార్, సట్టి శంకరయ్య పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి ఆఖరి అస్త్రం..

**- గులాబీ బాస్ కొత్తవ్యూహం ఏమిటి?**

**మెదక్ :** కేసీఆర్ సభకు వస్తారు. కానీ సీఎంగానే అసెంబ్లీలో అడుగు పెడుతారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పిన మాట ఇది. చిల్లర మాటలు మాట్లాడే వారి ముందుకొచ్చి తాను సభలో పాల్గొనాలా.? అంటూ గులాబీ బాస్ కూడా సభకు రాబోనని తేల్చి చెప్పేశారు. ఇన్నాళ్లు సీఎం రేవంత్‌రెడ్డి ఎన్ని డిమాండ్లు చేసినా..ఎన్ని ఎత్తులు వేసినా..ప్రతిపక్ష నేత కేసీఆర్‌ను అసెంబ్లీకి రప్పించేందుకు చేసిన ప్రయత్నాలేవి ఫలించలేదు. అందుకే సీఎం రేవంత్‌రెడ్డి ఆఖరి అస్త్రాన్ని బయటికి తీశారన్న ప్రచారం నడుస్తోంది. ఎలాగైనా కేసీఆర్ నోరు తెరిపించాలి.. ఆయనతో వివరణ ఇప్పించాలనేదే రేవంత్ టార్గెట్ అని..అందుకోసం ఏ అవకాశాన్ని ఆయన వదులుకోవడం లేదంటున్నారు.ఆ మాట కొస్తే కొత్త కొత్త పొలిటికల్ వెపన్స్‌ను బయటికి తీస్తూ కేసీఆర్‌ను టార్గెట్ చేస్తున్నారు. ఇప్పుడు ఆయన ఫాంహౌస్ ల్యాండ్స్‌లో దళితుల భూమి ఉందంటూ ఏకంగా విచారణకు ఆదేశించారు. ఆల్రెడీ ఎంక్వైరీ జరుగుతోంది. రెవెన్యూ అధికారులు ఫీల్డ్ విజిట్ కూడా చేశారు. అదంతా అడ్మినిస్ట్రేషన్ ప్రాసెస్ కాగా .. కాంగ్రెస్ ఎంపీలు కేసీఆర్ ఫాంహౌస్ పరిశీలనకు వెళ్లడం మరో రాజకీయ ఎత్తుగడ అన్న టాక్ నడుస్తోంది. ఎంపీలు వెళ్లి అక్కడ చేసేదేం లేదని..జస్ట్ మీడియాలో హైప్ కోసం..కేసీఆర్ ఆస్తులు సంపాదించారని ఎక్స్‌పోజ్ చేసే ఎజెండాలో భాగంగానే ఫాంహౌస్ పర్యటన పెట్టుకున్నారని అంటున్నారు.ప్రతీసారి వన్స్ మోర్ అంటూ కేసీఆర్‌కు ఓపెన్ ఛాలెంజ్ చేస్తూ వస్తున్నారు సీఎం రేవంత్ రెడ్డి. పదేళ్ల పాలనలో తెలంగాణకు బీఆర్ఎస్ ఏం చేసిందో..కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలో ఏం జరిగిందో..అసెంబ్లీలో ప్రజల ముందే చర్చిద్దామంటూ ఆ మధ్య సవాల్ చేశారు రేవంత్. చర్చలో తాను ఓడిపోతే ప్రజలకు క్షమాపణ చెబుతానని..కేసీఆర్ ఓడిపోతే ఫాంహౌస్‌కే పరిమితం అవుతారా అని ఛాలెంజ్ చేసిన సందర్భాలున్నాయి. కేసీఆర్ సభకు వస్తే ఆయన గౌరవానికి భంగం కలగకుండా చూసుకునే బాధ్యత కూడా తనదంటూ చెప్పుకొచ్చారు.ఇదంతా ఓ ఎత్తు అయితే..ఓ వైపు ఫోన్ ట్యాపింగ్ కేసు..ఇంకోవైపు విద్యుత్ కొనుగోళ్లపై విచారణ.. మరోవైపు కాళేశ్వరం దర్యాప్తు..ఇలా రకరకాల ఇష్యూస్‌తో కేసీఆర్ మౌనాన్ని బద్దలు కొట్టే ప్రయత్నం చేశారు సీఎం. అయినా నో కామెంట్ అంటూ సైలెంట్‌గా ఉంటూ వచ్చారు కేసీఆర్. ఫాంహౌస్‌లో నేతలతో భేటీ అయినా..పబ్లిక్ మీటింగ్‌లకు అటెండ్ అయినా..ఎక్కడా రేవంత్ పేరు తీయకుండానే ఈ ప్రభుత్వ పనితీరు బాలేదని..ప్రజలు సంతోషంగా లేరని చెప్పుకొంటూ వస్తున్నారు కేసీఆర్. దీంతో ఇన్నాళ్లు రేవంత్ వేసిన ఎత్తులేవి వర్కౌట్ కాలేదు. ప్రభుత్వం, సీఎం రేవంత్ చేసిన ఏ ఆరోపణపై కేసీఆర్ బయటికి వచ్చి రియాక్ట్ కాలేదు. ఈ నేపథ్యంలోనే రేవంత్ ఫైనల్ పంచ్ ఇచ్చేందుకు ఫాంహౌస్ ల్యాండ్స్ చుట్టూ ఎంక్వైరీ అంటూ రచ్చకు తెరలేపారని అంటున్నారు.అధికార పార్టీ నుంచి ఎన్ని విమర్శలు వచ్చినా..రేవంత్‌రెడ్డి ఎన్నిసార్లు కేసీఆర్ను ఉద్దేశించి పర్సనల్ అటాక్ చేసినా..దమ్ముంటే అసెంబ్లీకి రావాలని సవాల్ చేసినా..గులాబీ బాస్ రియాక్ట్ అయిన దాఖలాలు లేవు. సీఎం రేవంత్ రెడ్డి పేరును కూడా ప్రస్తావించకుండా కేసీఆర్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారన్న ఒపీనియన్స్ ఉన్నాయి. సీఎం రేవంత్, కాంగ్రెస్ నేతలు అలిగేషన్స్‌కు సమాధానం చెప్పే బాధ్యతను కేటీఆర్, హరీశ్‌రావులే తీసుకుంటున్నారు. రేవంత్ రెడ్డి స్థాయికి తామే సరిపోతామ్..కేసీఆర్ స్పందించాల్సిన అవసరం లేదని వాళ్లిద్దరే రివర్స్ అటాక్‌కు దిగుతున్నారు.కానీ రేవంత్ టార్గెట్ ఒక్కటే. కేసీఆర్ నోరు తెరిపించాలి. తన పేరు ప్రస్తావించి మాట్లాడే పరిస్థితి తీసుకురావాలి. అన్నింటికి మించి రేవంత్ వర్సెస్ కేసీఆర్ అన్నట్లుగానే తెలంగాణ పొలిటికల్ సినారియోలో డైలాగ్ వార్ కొనసాగాలనేది రేవంత్ మాస్టర్ ప్లాన్ అంటున్నారు. అందుకే సందర్భం దొరికిన ప్రతీసారి కేసీఆర్‌ను టార్గెట్ చేస్తూ వస్తున్నారని అంటున్నారు. సరిగ్గా ఎన్నికలకు ఏడాది ముందు కేసీఆర్ రంగంలోకి దిగాలని..అదే తమ ఎన్నికల అస్త్రమని బీఆర్ఎస్ భావిస్తోంది. అదే జరిగితే ఎన్నికల్లో కేసీఆర్‌కు సానుభూతి వచ్చే అవకాశం ఉంటుందని.. ఆలోపే కేసీఆర్ నోరు తెరిపించాలని రేవంత్ ప్లాన్ అని అంటున్నారు. దీంతో ఈ ఇద్దరి పోరాటం.. రసవత్తరంగా మారుతోంది.మరి ఈ సారి రేవంత్ వేసిన ల్యాండ్ ఎంక్వైరీపై కేసీఆర్ స్పందిస్తారా.? రేవంత్ ఫైనల్ పంచ్‌కు కేసీఆర్ మౌనం వీడుతారా.? ఇప్పటివరకు అనుసరిస్తున్న వ్యూహాన్నే కొనసాగిస్తారా.? ఇదే ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ఇంట్రెస్టింగ్ టాపిక్‌గా మారింది. ఒకవేళ కేసీఆర్ స్పందిస్తే..కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్య రాజకీయ సమరం కొత్త మలుపు తిరిగే అవకాశం ఉంది. స్పందించకపోతే..బ్లేమ్ గేమ్ వెపన్‌గా మలుచుకునేందుకు హస్తం పార్టీ రెడీ అవుతోంది. రేవంత్ లేవనెత్తిన ఈ ల్యాండ్ లడాయి ఎటు టర్న్ తీసుకుంటుందో చూడాలి మరి.

# జనాభా లెక్కల సేకరణ సందర్భంగా కులగణన కచ్చితంగా చేపట్టాలి

**- ఎంపీ వద్దిరాజు డిమాండ్**

కులగణన,బీసీల న్యాయమైన హక్కుల కోసం బీఆర్ఎస్ పార్లమెంటులో పోరాడుతుంది: ఎంపీ వద్దిరాజుదేశ జనాభాలో అత్యధిక సంఖ్యలో ఉన్న బీసీలు,బహుజనులు అనాదిగా అన్ని రంగాలలో తీవ్ర అణచివేతకు గురవుతున్నారని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర ఆవేదన వ్యక్తంచేశారు.జనగణన సందర్భంగా కులగణన కూడా చేపడతామని ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రకటించినప్పటికీ, ఆచరణలో మాత్రం ఎటువంటి పురోగతికి నోచుకోకపోవడం శోచనీయమన్నారు.జనాభా లెక్కలతో పాటుగా కులగణన కూడా చేపట్టాలని డిమాండ్ చేస్తూ బీసీ ఇంటెలెక్చువల్ ఫోరం,బీసీ పొలిటికల్ ఫోరంల ఆధ్వర్యాన సోమవారం అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్ పార్క్ వద్ద వందలాది మంది ఆందోళనకు దిగారు.ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ,బీసీలు,బహుజనుల పట్ల అటు కేంద్రంలో,ఇటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు అవలంభిస్తున్న వైఖరిని నిశితంగా విమర్శించారు.దేశంలో బీసీలు 60 శాతానికి పైగా ఉన్నారని,ఎస్సీ, ఎస్టీ,ఆదివాసీలు, మైనారిటీలతో కలిపితే బహుజనులు 85-90 శాతంగా ఉన్నారని చెప్పారు.అయితే, జనాభాలో అత్యధిక సంఖ్యలో ఉన్న బహుజనుల ఓట్లపై ఉన్న శ్రద్ధ రాజ్యాధికారంలో వాళ్లకు సముచిత స్థానం కల్పించడంలో చూపడం లేదని కాంగ్రెస్, బీజేపీలపై ఎంపీ రవిచంద్ర మండిపడ్డారు. ప్రధాని నరేంద్రమోడీ బీసీ అయి ఉండి కూడా బీసీల న్యాయమైన హక్కులను పరిరక్షించడంలో,పరిష్కరించడంలో విఫలమయ్యారని దుయ్యబట్టారు.దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 80 ఏళ్లు దాటిన కూడా బీసీల సంక్షేమం,సముద్ధరణకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ లేకపోవడం తీవ్ర బాధాకరం అని ఎంపీ వద్దిరాజు వ్యాఖ్యానించారు.బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో,విద్యా,ఉద్యోగ రంగాలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న,ఏటా బడ్జెట్లో 20వేల కోట్ల చొప్పున కేటాయిస్తామంటూ ఇచ్చిన హామీలను పాలకులు విస్మరించడం విచారకరమన్నారు.చేతిలో రాజ్యాంగ ప్రతిని పట్టుకుతిరిగే రాహుల్ గాంధీ బీసీ రిజర్వేషన్ల పెంపుదల గురించి కనీసం ఆలోచించడం లేదని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు.బీసీ రిజర్వేషన్లు పెంచాలంటూ పార్లమెంటులో తాను ప్రవేశపెట్టిన ప్రైవేట్ మెంబర్ బిల్లుకు కాంగ్రెస్ నాయకత్వాన ఉన్న ఇండియా కూటమి మద్దతివ్వలేదని, అధికారంలో ఉన్న బీజేపీ పట్టించుకోవడం లేదని ఎంపీ రవిచంద్ర ఆవేదన వెలిబుచ్చారు.కులగణన చేపడితే బీసీలు,బహుజనుల జనాభా లెక్కలు,80 ఏళు ్లగా వారికి జరుగుతున్న అన్యాయాలు,వాస్తవాలు బయటపడతాయని పాలకులు భయపడుతున్నారని ఆయన వ్యాఖ్యానించారు.జనాభా లెక్కల సేకరణ సందర్భంగా కులగణన చేపట్టేందుకు గాను ప్రత్యేక క్యూఆర్ కోడ్,కాలమ్ పొందుపర్చాలని,బీసీలకు కేంద్రంలో ప్రత్యేకంగా మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలన్న న్యాయమైన డిమాండ్ల సాధనకు తమ పార్టీ బీఆర్ఎస్ పార్లమెంట్ లోపల,బయట తన పోరాటాన్ని కొనసాగిస్తుందని ఎంపీ వద్దిరాజు చెప్పారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి వీ.శ్రీనివాస్ గౌడ్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, ఇంటెలెక్చువల్ ఫోరం చైర్మన్ చిరంజీవులు, పొలిటికల్ ఫోరం చైర్మన్ బాలరాజ్ గౌడ్,సర్పంచుల సంఘం అధ్యక్షుడు యాదయ్య గౌడ్ తదితర ప్రముఖులతో పాటు వందలాది బీసీలు పాల్గొన్నారు.

# జలదృశ్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి ఘన నివాళులు

**హైదరాబాద్** స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమ నాయకుడు, ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 14వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ ట్యాంక్‌బండ్ జలదృశ్యంలో ఉన్న ఆయన విగ్రహానికి పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, తెలంగాణ పద్మశాలి కో-ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరు శ్రీనివాస్, తెలంగాణ హ్యాండ్లూమ్/లూమ్ కార్పొరేషన్ చైర్మన్ దూడెం వెంకటరమణ, తుడా చైర్మన్ గుండు సుధారాణి, వకుళాభరణం కృష్ణమోహన్ తదితరులు పాల్గొని బాపూజీ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. కొండా లక్ష్మణ్ బాపూజీ స్వాతంత్ర్య ఉద్యమం నుంచి తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం వరకు ప్రజల కోసం నిరంతరం పోరాడిన మహనీయుడని గుర్తుచేశారు. ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, తెలంగాణ సాధన కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన పదవిని సైతం త్యాగం చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. బీసీలు, చేనేత కార్మికులు, పద్మశాలీల అభ్యున్నతికి ఆయన చేసిన కృషిని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని గాంధీభవన్లో కూడా తెలంగాణ ఖఅఅ మహేష్ కుమార్ గౌడ్ తో కలిసి కాంగ్రెస్ శ్రేణులు బాపు కొండా లక్ష్మణ్ చిత్రపటానికి నివాళులు అర్పించారుకొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు సామాజిక న్యాయం, సమానత్వం, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పలువురు బీసీ నాయకులు, పద్మశాలి సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళులర్పించారు.

# వీనస్ అసోసియేషన్ వినాయక మండపంలో మోదక హోమం





సుల్తాన్ బజార్ (ప్రశ్న న్యూస్) వినాయక నవరాత్రుల్లో భాగంగా కృపారాంబాగ్ లో వీనస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం లో కొలువైన విఘ్నేశ్వరుడు ప్రత్యేక పూజలను అందుకుంటు భక్తులకు దర్శనమిస్తున్నాడు. అత్యంత రమణీయంగా, రంగురంగుల విద్యుత్ దీపాలతో వెలిగిపోతున్న మండపంలో కొలువైన స్వామిని దర్శించుకునేందుకు రెండు కళ్ళు చాలడం లేదు. సోమవారం నాడు వినాయక మండపంలో ప్రత్యేకంగా నిర్వహించిన సహస్ర మోదక్ హోమం ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంది. మోదక ప్రియుడైన విఘ్నేశ్వరుడికి 1100 మోకదక్ లతో శాస్త్రోక్తంగా హోమం నిర్వహించడం వల్ల విఘ్నేశ్వరుని అనుగ్రహంతో అత్యంత శుభ ఫలితాలు కలుగుతాయని శాంత్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్.కే. సుబాష్, మనోజ్, ప్రభాకర్, రఘు, సుచేంద్ర, శర్మాజీ, ఓపి సోని, కిషన్ రావు, నితిన్ కపూర్, శుభం కపోకపూర్, దాస్ వినాయక్, అగ్నివేష్, చిద్విలాస్, శివ, అభి, అరుణ్, ప్రతీక్, అనిల్, పాటు అత్యధికంగా భక్తులు పాల్గొన్నారని శాంత్ కుమార్ తెలిపారు.

## హరిద్వార్‌కు షాద్‌నగర్ యోగ సాధకుల పయనం




షాద్‌నగర్(ప్రశ్న న్యూస్) హరిద్వార్‌లో నిర్వహించనున్న ముఖ్య యోగ శిక్షకుల శిక్షణ కార్యక్రమానికి షాద్‌నగర్‌కు చెందిన ఎనిమిది మంది యోగ సాధకులు సోమవారం బయలుదేరారు. షాద్‌నగర్ యోగ వ్యవస్థాపక అధ్యక్షుడు పానుగంటి శశిధర్ ఆధ్వర్యంలో యోగ శిక్షకులు రామయ్య అధ్యక్షతన ఈ బృందం యోగ మెయిన్ సెంటర్ నుంచి హరిద్వార్‌కు పయనమైంది.హరిద్వార్‌లో జరిగే ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో యోగ సాధనలోని ఆధునిక పద్ధతులు, బోధనా విధానాలు, యోగ శిక్షణలో పాటించాల్సిన అంశాలు, శిక్షకుల నైపుణ్యాలపై సాధకులు శిక్షణ పొందనున్నారు. ఈ శిక్షణ ద్వారా యోగపై మరింత అవగాహన పెంపొందించుకోవడంతో పాటు, భవిష్యత్తులో మరింత సమర్థవంతంగా యోగ శిక్షణ అందించేందుకు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడమే లక్ష్యంగా బృందం ముందుకు సాగుతోంది.యోగ సాధనను ప్రజల్లో మరింత విస్తృతంగా తీసుకెళ్లేందుకు ఈ శిక్షణ కార్యక్రమం ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు. హరిద్వార్‌లో శిక్షణ పూర్తి చేసుకుని తిరిగి వచ్చిన అనంతరం తమ అనుభవాలను ఇతర యోగ సాధకులతో పంచుకుంటామని వారు పేర్కొన్నారు.

## హరిద్వార్‌కు యోగా శిక్షకుల బృందం పయనం

### హైదరాబాద్ సౌత్ జోన్ ఆధ్వర్యంలో యోగా శిక్షణకు బయలుదేరిన బృందం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)హైదరాబాద్ సౌత్ జోన్ అధ్యక్షుడు అనిల్ జి, యోగా ప్రచారకుడు ఏ. సత్తయ్య, యువభారత్ ప్రతినిధి నరేష్ చారి, యోగా గురువు పి. లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో యోగా శిక్షకుల బృందం సోమవారం యోగా మెయిన్ సెంటర్ నుంచి హరిద్వార్‌కు పయనమైంది. హరిద్వార్‌లో నిర్వహించనున్న ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో బృంద సభ్యులు పాల్గొననున్నారు. ఈ శిక్షణ ద్వారా యోగా సాధన, బోధనా పద్ధతులు, యోగా శిక్షకుల నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకోవడం ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.శిక్షణ అనంతరం తిరిగి హైదరాబాద్‌కు వచ్చిన బృంద సభ్యులు నగరంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలకు ఉచితంగా యోగా శిక్షణ అందించనున్నట్లు వెల్లడించారు. సమాజంలో యోగా పట్ల అవగాహన పెంచడంతో పాటు ప్రజలు ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకునేలా నిరంతరం కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు."అందరి ఆరోగ్యమే మా లక్ష్యం" అనే సంకల్పంతో ప్రజలకు యోగా సాధనను చేరువ చేస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు.ఈ యోగా శిక్షణ బృందంలో బొజ్జ రాజేష్ రెడ్డి, కొండల్ రెడ్డి, వెంకట్ రెడ్డి, లింగారెడ్డి, రవీందర్ రెడ్డి, సత్యనారాయణ, మహిపాల్ రెడ్డి, టంగుటూరి కృష్ణ, పురుషోత్తం, కే. రవీందర్ రెడ్డి, ఎనుముల జితేందర్ రెడ్డి, ఏనుగు గోపాల్ రెడ్డి, జి. సతీష్ కుమార్, కాటేపాగ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## టీ జీఎస్ఆర్టీసీ ఫరూక్‌నగర్ డిపోలో యోగా అవగాహన కార్యక్రమం

### డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు నిత్యం యోగా సాధన చేయాలి



హైదరాబాద్(ప్రశ్న న్యూస్) టీ జీఎస్ఆర్టీసీ ఫరూక్‌నగర్ డిపోలో డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లకు సంపూర్ణ ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యోగ గురు సత్తయ్య ఆధ్వర్యంలో ధ్యానం, ప్రాణాయామం, వివిధ ఆసనాలు, ఆహార నియమాలు, ఆరోగ్య పరిరక్షణ, ప్రమాదాల నివారణ వంటి అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా యోగ గురు సత్తయ్య మాట్లాడుతూ ఆర్టీసీ సిబ్బంది నిరంతరం విధుల్లో ఉండటం వల్ల శారీరక, మానసిక ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉందన్నారు. ప్రతిరోజూ కొంత సమయం యోగ, ధ్యానం, ప్రాణాయామానికి కేటాయిస్తే ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవడంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెంపొందించుకోవచ్చని తెలిపారు. ముఖ్యంగా డ్రైవర్లు విధుల్లో ఏకాగ్రతతో వ్యవహరించడం ద్వారా ప్రమాదాల నివారణకు దోహదపడవచ్చన్నారు.ఫరూక్‌నగర్ డిపోను ఆదర్శవంతమైన డిపోగా తీర్చిదిద్దేందుకు సిబ్బంది ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉండాల్సిన అవసరం ఉందని డిపో మేనేజర్ పేర్కొన్నారు. యోగను నిత్యజీవితంలో భాగంగా చేసుకుని ఆరోగ్యకరమైన జీవనశైలిని కొనసాగించాలని ఆయన సూచించారు.

# జనసేనలోకి వరుపుల సుబ్బారావు

## పవన్ సమక్షంలో కండువా కప్పుకున్న మాజీ ఎమ్మెల్యే

### ప్రత్తిపాడు, పెద్దాపురం, జగ్గంపేట నుంచి వైసీపీ నేతల చేరికలు





పిఠాపురం(ప్రశ్న న్యూస్ ) కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత వరుపుల సుబ్బారావు జనసేన పార్టీలో చేరారు. సోమవారం సాయంత్రం పిఠాపురంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ సమక్షంలో ఆయన పార్టీ కండువా కప్పుకున్నారు. పవన్ కల్యాణ్ సుబ్బారావును సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.వరుపుల సుబ్బారావుతోపాటు పెద్దాపురం, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాలకు చెందిన పలువురు వైసీపీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు జనసేనలో చేరినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.పెద్దాపురం మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్, వైసీపీ నాయకుడు నెక్కంటి సాయిప్రసాద్, సామర్లకోట మాజీ మున్సిపల్ ఛైర్మన్ గంగిరెడ్డి అరుణతోపాటు రెండు మున్సిపాలిటీల పరిధిలోని మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు చేరిన వారిలో ఉన్నారు. ప్రత్తిపాడు, పెద్దాపురం, జగ్గంపేట నియోజకవర్గాలకు చెందిన పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు కూడా జనసేనలో చేరినట్లు తెలిపారు.పార్టీలో చేరిన వారికి పవన్ కల్యాణ్ కండువాలు కప్పి ఆహ్వానించారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించినట్లు జనసేన వర్గాలు వెల్లడించాయి.కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగినట్లు పార్టీ తెలిపింది.ఈ కార్యక్రమంలో రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కళ్యాణం శివశ్రీనివాస్, రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి సహకార సంస్థ ఛైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఛైర్మన్ తోట సుధీర్, కౌడా ఛైర్మన్ తలాటం సత్య, పిఠాపురం ఫైవ్ మెన్ కమిటీ సభ్యుడు ఓదూరి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.ప్రత్తిపాడు మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావుతోపాటు ఆయా నియోజకవర్గాలకు చెందిన పలువురు వైసీపీ నాయకులు జనసేనలో చేరడం స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా ప్రత్తిపాడు, పెద్దాపురం, జగ్గంపేట నియోజకవర్గాల నుంచి మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు చేరడంతో ఆయా ప్రాంతాల్లో పార్టీ సంస్థాగత కార్యకలాపాలపై జనసేన దృష్టి సారిస్తున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

# చెరువులకు కొత్త కళ.. పల్లెలకు కొత్త వెలుగు

### నీటి వనరులే ఇక ఆరోగ్య కేంద్రాలు.. ఆహ్లాద వేదికలు
### ఫకృద్దీన్‌పాలెం మైసమ్మ చెరువును ప్రారంభించిన పవన్ కల్యాణ్
### రూ.6 కోట్లతో పిఠాపురంలో 11 చెరువుల సుందరీకరణ
### రాష్ట్రవ్యాప్తంగా 105 చెరువులకు కొత్త రూపం





పిఠాపురం(ప్రశ్న న్యూస్) చెరువు అంటే ఇక కేవలం నీటి నిల్వ కేంద్రం కాదు.. ఊరికి ఆహ్లాదాన్ని పంచే వేదిక.. ప్రజలకు ఆరోగ్యాన్ని అందించే ప్రదేశం.. చిన్నారులకు ఆటస్థలం.. పచ్చదనానికి నిలయంగా రూపుదిద్దుకుంటోంది. గ్రామీణ ప్రాంతాల్లోని చెరువులను ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేలా తీర్చిదిద్దే కార్యక్రమంలో భాగంగా పిఠాపురం నియోజకవర్గంలోని ఫకృద్దీన్‌పాలెం మైసమ్మ చెరువుకు కొత్త రూపం వచ్చింది. రూ.73 లక్షల వ్యయంతో సుందరీకరించిన ఈ చెరువు, వాకింగ్ ట్రాక్, ఓపెన్ ఎయిర్ జిమ్, చిల్డ్రన్స్ పార్కును రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సోమవారం ప్రారంభించారు.చెరువుల అభివృద్ధిని కేవలం నీటి వనరుల పరిరక్షణకే పరిమితం చేయకుండా.. గ్రామీణ ప్రజలకు ఆహ్లాదం, ఆరోగ్యం, పచ్చదనం అందించే సామాజిక వేదికలుగా మార్చాలన్న లక్ష్యంతో మైసమ్మ చెరువును నమూనా ప్రాజెక్టుగా అభివృద్ధి చేశారు.మైసమ్మ చెరువు గట్టును బలోపేతం చేయడంతోపాటు పరిసర ప్రాంతాల్లో పచ్చటి మొక్కలు నాటారు. గట్టుపై ప్రత్యేకంగా వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. గ్రామస్థులు ఉదయం, సాయంత్రం వేళల్లో నడక సాగించేలా దీనిని రూపొందించారు.మహిళలు, యువత, వృద్ధులు వ్యాయామం చేసుకునేందుకు ఓపెన్ ఎయిర్ జిమ్ ఏర్పాటు చేశారు. చిన్నారుల కోసం ప్రత్యేకంగా చిల్డ్రన్స్ పార్కును తీర్చిదిద్దారు. జాతీయ భావనను పెంపొందించేలా జెండా స్థూపాన్ని ఏర్పాటు చేశారు.పవన్ కల్యాణ్ చిన్నారులతో కలిసి చిల్డ్రన్స్ పార్కును ప్రారంభించారు. అక్కడి సౌకర్యాలను పరిశీలించి, ఆడుకుంటున్న పిల్లలకు తినుబండారాలు, చాక్లెట్లు అందించారు.చెరువు ప్రారంభోత్సవానికి ముందు గట్టుపై ఉన్న ఆలయంలో పవన్ కల్యాణ్ మైసమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెరువు మధ్యభాగంలో నందీశ్వరుడి సహిత శివుడి విగ్రహం ఏర్పాటు చేసేందుకు చేపడుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. గ్రామస్థుల ఆహ్వానం మేరకు ఫకృద్దీన్‌పాలెంలోని వినాయకుడి ఆలయాన్ని కూడా సందర్శించారు.చెరువు ప్రారంభోత్సవానికి వచ్చిన పవన్ కల్యాణ్ గ్రామస్థులను పలకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అనంతరం ఫకృద్దీన్‌పాలెం గ్రామ సచివాలయ భవనం, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలించారు.తడి చెత్త, పొడి చెత్త కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కుండీలను పరిశీలించి పారిశుధ్య నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. అక్కడ పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను పలకరించి వారితో ఫొటోలు దిగారు.ఒకప్పుడు వర్షపు నీటిని ఒడిసిపట్టే చెరువులుగా మాత్రమే కనిపించిన గ్రామీణ జలవనరులు.. ఇప్పుడు ఊరి సామాజిక జీవనంలో భాగమయ్యేలా రూపుదిద్దుకుంటున్నాయి. ఉదయం నడకకు.. సాయంత్రం వ్యాయామానికి.. చిన్నారులకు ఆటకు.. వృద్ధులకు సేదతీరేందుకు.. పచ్చదనాన్ని ఆస్వాదించేందుకు ఒకే ప్రదేశంలో సదుపాయాలు అందుబాటులోకి వస్తున్నాయి. ఫకృద్దీన్‌పాలెం మైసమ్మ చెరువు అందుకు ఒక నమూనాగా నిలుస్తోంది.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్, డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, భాజపా నాయకుడు కృష్ణంరాజు, ఎన్ఆర్ఈజీఎస్ డైరెక్టర్ షణ్ముఖ్, పడా పీడీ శివరాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారి సేవకులకు ఆత్మీయ కానుక

### అర్చకులు, వేదపారాయణదారులు, వాహన బేరర్లు, మేళం సిబ్బందికి జ్యోతుల నెహ్రూ దంపతుల వస్త్ర బహూమానం



తిరుమల(ప్రశ్న న్యూస్) శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో అహర్నిశలు సేవలందిస్తున్న ఆలయ సిబ్బందికి జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ దంపతులు ఆత్మీయ కానుక అందించారు. అర్చకులు, వేదపారాయణదారులు, వాహన బేరర్లు, మేళం సిబ్బంది, ఇతర ఆలయ సిబ్బందికి సోమవారం వస్త్ర బహుమానం అందజేశారు.తిరుమల వైభవోత్సవ మండపంలో జరిగిన కార్యక్రమంలో టీటీడీ అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి చేతుల మీదుగా సిబ్బందికి వస్త్రాలను అందించారు.ఈ సందర్భంగా అదనపు ఈవో మాట్లాడుతూ.. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో నిరంతరం సేవలందిస్తున్న ఆలయ సిబ్బంది సేవలను గుర్తించి, వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో జ్యోతుల నెహ్రూ దంపతులు వస్త్ర బహుమానం అందించడం అభినందనీయమన్నారు. స్వామివారి సేవలో భాగస్వాములవుతున్న సిబ్బందిని గౌరవించడం ద్వారా వారిలో సేవా స్ఫూర్తి మరింత పెరుగుతుందని తెలిపారు.కార్యక్రమంలో టీటీడీ సీవీఎస్వో కే.వి. మురళీకృష్ణ, శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో భాస్కర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పెండింగ్ కేసులకు చెక్ పెట్టాలి

### దర్యాప్తు వేగవంతం చేసి త్వరితగతిన పరిష్కరించాలి
### స్థానిక ఎన్నికలకు ముందస్తు ప్రణాళిక.. సమస్యాత్మక ప్రాంతాలపై నిఘా




పామూరు(ప్రశ్న న్యూస్) పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి వాటిని త్వరితగతిన పరిష్కరించాలని మార్కాపురం జిల్లా ఎస్పీ పోలీసు అధికారులను ఆదేశించారు. కనిగిరి సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్‌స్టేషన్ల పనితీరు, శాంతిభద్రతలు, నేర నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై సోమవారం పామూరు సర్కిల్ కార్యాలయంలో డీఎస్పీ, సీఐలు, ఎస్ఐలతో సమీక్ష నిర్వహించారు.పోలీస్‌స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల వివరాలను ఎస్పీ పరిశీలించారు. కేసుల దర్యాప్తు, అరెస్టులు, కేసుల ఛేదింపు తదితర అంశాలపై సంబంధిత అధికారులను ఆరా తీశారు. యూఐ కేసుల సంఖ్యను తగ్గించాలని సూచించారు. పెండింగ్ కేసులను వీలైనంత త్వరగా పరిష్కార దశకు తీసుకురావాలని ఆదేశించారు.అరెస్టులు, చార్జిషీట్లు, నాన్ బెయిలబుల్ వారెంట్లను పెండింగ్‌లో ఉంచకుండా సత్వర చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. కేసుల దర్యాప్తులో నాణ్యతతో పాటు వేగానికీ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఇప్పటి నుంచే పటిష్ట ప్రణాళికతో ముందుకు సాగాలని ఎస్పీ ఆదేశించారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

**- ఉపకులపతి డా. దండ రాజిరెడ్డి**



గజ్వేల్ (ప్రశ్న న్యూస్ ) ములుగు: తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిదాత, స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ మంత్రి శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ గౌరవ ఉపకులపతి డా. దండ రాజిరెడ్డి బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు.కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డా. దండ రాజిరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన కృషి, ప్రజాసేవ, సామాజిక న్యాయం కోసం ఆయన సాగించిన పోరాటం చిరస్మరణీయమని అన్నారు. తెలంగాణ ప్రజల హక్కులు, ఆత్మగౌరవం కోసం బాపూజీ చేసిన సేవలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా. ఏ. భగవాన్, డీన్ హార్టికల్చర్ మరియు విద్యార్థి వ్యవహారాల డీన్ జె. చీనా, పరిశోధనా విభాగం సంచాలకులు డా. డి. లక్ష్మీనారాయణ, విస్తరణ విభాగం సంచాలకులు, పీజీ అధ్యయనాల డీన్ డా. టి. సురేష్ కుమార్, ఇన్‌చార్జి అధికారి డా. సుచిత్ర, ప్రణాళిక--పర్యవేక్షణ విభాగం డైరెక్టర్ డా. డి. అనితా కుమారి, విద్యార్థులు, బోధన, బోధనేతర, అవుట్‌సోర్సింగ్, ఒప్పంద సిబ్బంది పాల్గొన్నారు.

# గజ్వేల్ డిగ్రీ కళాశాల విద్యార్థికి బంగారు పతకం

**కళాశాల ప్రిన్సిపల్ డా. నికత్ అంజుమ్**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )సిద్దిపేట జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 19న నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అటానమస్, గజ్వేల్‌కు చెందిన బీఏ ద్వితీయ సంవత్సరం విద్యార్థి టి. జ్ఞానేశ్వర్ ప్రతిభ కనబరిచాడు. 100 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం సాధించి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు.జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.జ్ఞానేశ్వర్ సాధించిన విజయంపై కళాశాల ప్రిన్సిపల్ డా. నికత్ అంజుమ్ అభినందనలు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎస్. గణపతిరావు, అకడమిక్ కోఆర్డినేటర్ జి. విజయభాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

# రాయవరంలో హాకా కేంద్రం ప్రారంభం

**రైతులకు ఎరువులు సులభంగా అందించడమే లక్ష్యం**

**ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ డా. యాదవ రెడ్డి, మాజీ రైతుబంధు సమితి రాష్ట్ర కోఆర్డినేటర్ దేవి రవీందర్**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )రాయవరం: గ్రామ రైతుల సౌకర్యార్థం రాయవరం గ్రామంలో హాకా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ డా. యాదవ రెడ్డి, మాజీ రైతుబంధు సమితి రాష్ట్ర కోఆర్డినేటర్ దేవి రవీందర్ హాజరై హాకా కేంద్రాన్ని ప్రారంభించారు.ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా రైతులు యూరియా కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, రాయవరం రైతులకు యూరియాతో పాటు ఇతర ఎరువులు సులభంగా అందుబాటులో ఉండేలా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇకపై రైతులు యూరియా కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా గ్రామంలోనే ఎరువులు కొనుగోలు చేసుకునే అవకాశం కలగనుంది.గ్రామ సర్పంచ్ బూడిద రమేష్ గౌడ్ చొరవతో, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి సహకారంతో రాయవరానికి హాకా కేంద్రం మంజూరైందని తెలిపారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని కేంద్రం ఏర్పాటుకు సహకరించిన ఎమ్మెల్సీ యాదవ రెడ్డికి గ్రామ రైతుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో-- బూడిద రమేష్ గౌడ్, సర్పంచ్, రాయవరం గ్రామపంచాయతీ, పాలకవర్గం, మాజీ సర్పంచ్ గణపురం గణేష్ యాదవ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

# త్వరలో వ్యవసాయ మంత్రి ఇల్లు ముట్టడి:నర్సింహా

- ఒక్క రోజు ధర్నా కేవలం శాంపిల్ మాత్రమే, రెచ్చగొడితే రేయి పగుళ్లు కష్టపడే కార్మిక లోకం ఐక్యం అవుతుంది.
- బోయిన్ పల్లి మార్కెట్ లో గంటకే అధికారులకు చెమటలు,నిరంతరం ధర్న సెగ తలుగుతే తంబోలకే తంబోలా.?
- నెలలు గడుస్తున్నా బోయిన్ పల్లి మార్కెట్ లో న్యాయం జరగట్లేదు.మూడు రోజుల్లో సమస్యలు పరిష్కారించాలి
- లేని పక్షంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరిస్తున్న కార్మికులు.
- నిన్నటి ధర్నలో సర్కార్ కు వ్యతిరేకంగా నినాదాలు చేసిన హామాలీలు.
- ఎమ్మెల్యే,ఎంపీ ప్రభుత్వంతో మాట్లాడాలి,లేకపోతే మమ్మల్ని సర్కార్ వద్దకు తీసుకెళ్లండి.మా బాధలు పెద్దలకి వివరిస్తాం.




కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో తీవ్ర సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కమీషన్ ఏజెంట్లు, హమాలీలు ఆందోళన చేపట్టారు.మార్కెట్లో తీవ్రమైన సమస్యలను పరిష్కరించడంతో పాటు మౌలిక వసతుల కల్పన చేయాలని డిమాండ్ చేస్తూ ఏ.ఐ.టి.యు.సి ఆధ్వర్యంలో హమాలీలు పెద్ద ఎత్తున బోయిన్ పల్లి మార్కెట్ లో నిరసనకు దిగారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకి వ్యతిరేకంగా హమాలీల నినాదాలు చేశారు. మార్కెట్లోకి వచ్చే కూరగాయల వాహనాలను అడ్డగించి దుకాణాల నుండి మార్కెట్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ చేపట్టారు.గత కొన్ని నెలలుగా మార్కెట్లో చెత్తా చెదారం కుప్పలుగా పేరుకుపోయి దోమలు ఈగలు దుర్వాసనతో విష జ్వరాల బారిన పడే హామాలీలు వారి సంపాదన ఆసుపత్రులకే ఖర్చు చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మూత్రశాలలు సరిగా లేక మహిళలు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారని, మంచినీటి సౌకర్యం సైతం లేకపోవడం బాధాకరమని అన్నారు.ఉదయం 4 గంటలకే మార్కెట్ కు వచ్చి విధులు నిర్వహించే తమకు మార్కెట్లో ఉన్న సమస్యలు తీవ్రంగా వేధిస్తున్నాయని వెంటనే ఈ సమస్యలను పరిష్కరించక పోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుడుతామని హెచ్చరించారు.ధర్నా కార్యక్రమంలో భాగంగా బోయిన్ పల్లి మార్కెట్ పాలకమండలి చైర్మన్ ఆనంద్ బాబు హమాలీలతో మాట్లాడి త్వరితగతన సమస్య పరిష్కారం చేసేందుకు వ్యవసాయ శాఖ మంత్రితో మాట్లాడుతానని హామీ ఇవ్వడంతో హమాలీలు ఆందోళన విరమించారు. గత కొన్ని నెలలుగా మార్కెట్ లో ఉన్న సమస్యలతో బాధపడుతున్న తమకు వెంటనే పరిష్కారం చూపాలని వారు డిమాండ్ చేశారు.

**ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ వెజిటబుల్ హమాలీ యూనియన్ అధ్యక్షుడు నర్సింహా మాట్లాడుతూ:**

బోయిన్ పల్లి మార్కెట్ లో నిన్న మెరుపు ధర్నకు దిగిన హమాలీలు, కమీషన్ ఏజెంట్లు.డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ యార్డులో గత కొన్ని నెలలుగా నెలకొన్న మౌళిక సదుపాయాల కల్పనలో మార్కెటింగ్ డిపార్ట్మెంట్ అధికారులు పూర్తిగా వైఫల్యం చెందారని మరో విషయం ఏమిటంటే సికింద్రాబాద్ వెజిటబుల్ కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్ అధ్యక్షుడు సోమ దేవేందర్ రెడ్డి లెక్కకు మించిన లేఖలు మార్కెట్ అధికారులకు అందజేసిన ఫలితం శూన్యంగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు.కళ్ల ముందు ఉన్న సమస్యలు పరిష్కరించాల్సిన మార్కెట్ అధికారులు,పనికి రాని వాటికి శంకుస్థాపనలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.మార్కెటింగ్ డిపార్ట్మెంట్ అధికారులు బోయిన్ పల్లి మార్కెట్ లో కోటి అరవై లక్షల రూపాయలతో నూతన వ్యాపార సముదాయాల కేంద్రాన్ని నిర్మాణం చేపట్టడాన్ని ఆయన తప్పు పట్టారు.కమర్షియల్ కాంప్లెక్స్ కి ఖర్చు చేసే నిధులు, యార్డ్ లో నెలకొన్న మౌళిక వసతులకు వెచ్చిస్తే అందరికి సౌలభ్యంగా ఉంటుందని నర్సింహా పేర్కొన్నారు.అంతేగానీప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతే సర్కార్ కి బుద్ధి చెప్పక తప్పదన్నారు.మరి ముఖ్యంగా మార్కెట్ యార్డులో చెత్త చెదారం కుప్పలు తెప్పలుగా ఉండడంతో ఈగలు దోమలు,ముక్కు పగిలే దుర్గంధంపు వాసన వెదజల్లుతుంది.దీనికి కారణంగా సగటున రోజుకు కార్మికులు ఆరోగ్య పరిస్థితులు క్షీణిస్తున్నాయని వీటికి ఎవరు బాధ్యులు అని ప్రశ్నించారు.వీలైన తొందరగా సమస్యను పరిష్కరించకపోతే వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు.అలాగే గతంలో కూడా హామీలు ఇచ్చినట్టు ఇచ్చి వాయిదాలు వేస్తూ పక్కదారి పట్టిస్తున్న వారికి ఈసారి గట్టిగానే సమాధానం చెప్పుదామని నర్సింహా తెలిపారు.

**సికింద్రాబాద్ వెజిటబుల్ కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్ అధ్యక్షుడు సోమ మాట్లాడుతూ:**

డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో మౌలిక సమస్యలు మా చుట్టు ఉన్నాయా లేక ఇబ్బందులు చుట్టు మేమున్నామా అని లో లోపల బాధపడుతూ వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు.సమాజం సిగ్గు పడెల ఇంత పెద్ద మార్కెట్ లో కనీస సౌకర్యాలు లేకపోవడం నిజంగా సిగ్గు పడాల్సిన అవసరం పాలకులకు,అధికారులకు ఉందన్నారు.గత కొంత కాలంగా సికింద్రాబాద్ వెజిటబుల్ కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్ తరపున వందల సంఖ్యలో ఉన్నతాధికారులకు,యార్డ్ సెక్రటరీ కి లేఖలు అందజేసినప్పటికి ఏ సమస్య పరిష్కారం కాలేదని ఆయన గుర్తు చేశారు.ప్రతి రోజు అవస్థలు పడుతూ రైతుల పంటను విక్రయిస్తున్న నేపథ్యంలో కొన్ని రుగ్మతలు వారి చెంత చేరి ఆరోగ్య క్షీణిస్తుంది.బోయిన్ పల్లి మార్కెట్ వార్షిక ఆదాయం సుమారు “14”కోట్లు పై మాటే,ఇంత ఆర్థిక సంపదను సృష్టిస్తున్న మార్కెట్ కి మౌళిక సమస్యల శాపంగా మారిందని,అదిగాక వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్, వివిధ హోదాల్లో ఉన్న అధికారులకు డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ టూరిజం స్పాట్ గా మారిందే తప్ప,వారిలో స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలే చిత్తశుద్ధి ఏమాత్రం లేదన్నారు.ఇప్పటికైనా అధికారులు, పాలకులు నిద్ర లేచి మార్కెట్ యార్డుల పరిస్థితుల పై ఫోకస్ చేస్తే సమస్యలు పారద్రోలుతాయి.ధర్న చేసే రైతులను ఆగం చేసే ఆలోచన మాకు లేదు, మా డిమాండ్ లు పరిష్కరిస్తే మా వ్యాపారం మేం చేసుకుంటామని సోమ దేవేందర్ రెడ్డి అన్నారు.బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ రాగిరి ఆనంద్ బాబు మాట్లాడుతూ: యార్డ్ లో నెలకొన్న మౌళిక సమస్యలు వాస్తవమేనని,అలాగే ఉన్నతాధికారులు,మంత్రి దృష్టికి పలుసార్లు తీసుకువెళ్ళిన విషయం అందరికి తెలిసిందే!గత కొన్ని నెలలుగా మార్కెట్ లో చోటుచేసుకున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని కమిటీ కూడా మీపక్షాన్నే ఉంటుందని, హమాలీ యూనియన్ ప్రతినిధులు ఇచ్చిన లేఖ ఏదైతే ఉందో దాన్ని రెండు రోజుల్లో వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నికలిసి స్థానికంగా నెలకొన్న మౌళిక సమస్యల పై చర్చించిడమే కాకుండా యుద్ధప్రాతిపదికన లేఖలో ఉన్న హామీలు నెరవేరె విధంగా మంత్రితో గ్రీన్ సిగ్నల్ తీసుకుంటామన్నారు.ఈధర్నలో సికింద్రాబాద్ వెజిటబుల్ కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్ కార్యదర్శి ఆర్వీసీ చంద్రారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ మిర్యాల శ్రీనివాస్,అంజి, ఎన్ఎంసి శ్రీనివాస్,ఎంవీసి దేవి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దేవేందర్ (దేవుడు),కమిటీ సభ్యులు కృష్ణ రెడ్డి,మార్కెట్ సెక్రటరీ ఈ.వెంకటేశం,హమాలీ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక మండపంలో గణపతి హోమం

**- అన్న ప్రసాద వితరణ**





బడంగ్ పేట్ (ప్రశ్న న్యూస్) వినాయక నవరాత్రుల్లో భాగంగా శ్రీసాయిబాలాజీ హోమ్స్ పేస్ 2, కమ్యూనిటీ హాల్ లో ప్రతిష్ఠించిన గణనాథుని మండపంలో పూజారి శ్రీరామచంద్ర శర్మ నేతృత్వంలో శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు సాయంత్రం మండపంలో సాయంకాలం పూజల అనంతరం సంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, గణపతి నామస్మరణతో ఈ ప్రాంతమంతా మారుమోగుతుంది. ఈ సందర్భంగా శ్రీరామచంద్రశర్మ మాట్లాడుతు కాలనీవాసుల సహకారంతో గణపతి నవరాత్రుల పూజలు ఘనంగా నిర్వహిస్తున్నామని, ప్రతిరోజు కాలనీవాసులు పూజల్లో పాల్గొని స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకుంటున్నారని తెలిపారు. గత ఆదివారం నాడు మండపం వద్ద గణపతి హోమం, అన్న ప్రసాద వితరణ కార్యక్రమలను నిర్వహించామని, సోమవారం నాడు సాయంత్రం ప్రత్యేకంగా మహిళలచే కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. వినాయక చవితి సందర్భంగా ప్రతి సంవత్సరం విభిన్న రూపాల్లో ఉన్న వినాయకుడిని ప్రతిష్టించి వినాయక చవితి నుండి సామూహికంగా నిమజ్జన కార్యక్రమం వరకు 11 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ఘనంగా పూజలను నిర్వహిస్తు ప్రతి రోజు సాయంత్రం పూజల అనంతరం స్వామివారికి మహాప్రసాద నివేదన, మహహారతి, తీర్థప్రసాదాల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. సామూహిక నిమజ్జనం వరకు నిర్వహించే గణేష్ నవరాత్రుల కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆహ్లాదకర వాతావరణంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించేట్లు తోడ్పాటునందిచి విఘ్నేశ్వరుని కృపకు పాత్రులవ్వాలని కోరారు.

# యానాదుల గడపకు సంక్షేమం విద్య.. మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి

**- ఐటీడీఏ (యానాది) పాలకమండలి సమావేశంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి**



నెల్లూరు(ప్రశ్న న్యూస్) యానాదుల సంక్షేమం, అభివృద్ధి బాధ్యత అందరిపైనా ఉందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. విద్య, మౌలిక వసతులు, ప్రభుత్వ పథకాలతో అనుసంధానం, అటవీ హక్కుల చట్టం అమలు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. సోమవారం నెల్లూరులో జరిగిన ఐటీడీఏ (యానాది) 11వ పాలకమండలి సమావేశంలో ఆమె పాల్గొని పలు అంశాలపై సమీక్షించారు. యానాదులు నివసించే ప్రాంతాల్లో ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కోవూరులో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి దాదాపు వెయ్యి మందికి ఆధార్ కార్డులు అందజేసినట్లు తెలిపారు. ఇంకా ఆధార్ లేక ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్న వారిని గుర్తించి..

అధికారులు వారి నివాస ప్రాంతాలకు వెళ్లి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. యానాదుల ఆవాసాల్లో మౌలిక వసతుల కొరత ఉన్న ప్రాంతాలను గుర్తించి దశలవారీగా సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో సీఎస్ఆర్ నిధులతో వసతులు కల్పించినట్లు తెలిపారు. గిరిజన విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ప్రశాంతిరెడ్డి సూచించారు. కోవూరు పరిధిలోని మూడు రెసిడెన్షియల్, మూడు డే స్కాలర్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంపై అధికారులను ప్రశ్నించారు. యానాదుల సంక్షేమం కేవలం పథకాల అమలుతో పరిమితం కాకుండా.. విద్య, ఉపాధి, మౌలిక వసతులు, భూ హక్కులు, ప్రభుత్వ సేవల ప్రాప్తి వంటి అన్ని రంగాల్లో పురోగతి సాధించేలా సమగ్ర చర్యలు అవసరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గిరిజన కుటుంబాలు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పూర్తిస్థాయిలో పొందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# 'మొద రాత్రి' మూవీ రివ్యూ!



తమిళంలో కామెడీ డ్రామా జోనర్ నుంచి ఒక సినిమా ఓటీటీకి వచ్చింది. రిషికాంత్ - అనిష్మా అనిల్ కుమార్ ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సినిమా పేరే 'మొద రాత్రి'. మైత్రీ మూవీ మేకర్స్ వారు తమిళంలో నిర్మించిన సినిమా ఇది. ఆగస్టు 21వ తేదీన థియేటర్లలో విడుదలైన ఈ సినిమా, ఈ నెల 18వ తేదీ నుంచి 'నెట్ ఫ్లిక్స్'లో స్ట్రీమింగ్ అవుతోంది. తమిళంతో పాటు తెలుగు .. మలయాళ .. కన్నడ .. హిందీ భాషల్లో ఈ సినిమా అందుబాటులో ఉంది. మారుతి ( రిషికాంత్) దుబాయ్ లో జాబ్ చేస్తూ ఉంటాడు. అతనికి తన ఊరుకు రావడంగానీ .. పెళ్లి చేసుకోవడం గాని ఎంతమాత్రం ఇష్టం ఉండదు. దుబాయ్ నుంచి అతను పంపిస్తున్న డబ్బులతో ఇక్కడి కుటుంబ సభ్యుల అవసరాలు తీరుతుంటాయి. అతనికి ఒక చెల్లి .. బావ ఉంటారు. మారుతి కుటుంబ సభ్యులంతా కలిసి అతనికి ఒక సంబంధం చూస్తారు. బుజ్జి లక్ష్మి ( అనిష్మా)తో పెళ్లి ఖాయం చేస్తారు. మారుతికి ఒక్క మాటకూడా చెప్పకుండా పెళ్లిరోజు నాటికి అతను దుబాయ్ నుంచి వచ్చేలా చేస్తారు. బుజ్జి లక్ష్మి తండ్రిలేని పిల్ల. ఆమె ఒక యువకుడిని ప్రేమిస్తుంది. ఈ విషయం తెలిసే తల్లి ఆమెకి మారుతి సంబంధం చూస్తుంది. పెళ్లి సమయానికి తాను ప్రేమించిన యువకుడితో లేచిపోవడానికి బుజ్జి లక్ష్మి ప్లాన్ చేస్తుంది. దుబాయ్ నుంచి వచ్చిన మారుతికి తన పెళ్లి విషయం అప్పుడే తెలుస్తుంది. తల్లి మాట కాదనలేక ఆ పెళ్లికి ఒప్పుకుంటాడు. పెళ్లి తరువాత శోభనానికి కూడా ఏర్పాట్లు జరుగుతూ ఉంటాయి. అందుకు అవసరమైన మంచాన్ని ప్రత్యేకంగా చేయించి తెప్పిస్తూ ఉంటారు. ముహూర్తానికి సమయం దగ్గర పడుతుంది. బుజ్జి లక్ష్మిని ప్రేమించిన యువకుడు సమయానికి ఆ ఊరు చేరుకోలేకపోతాడు. దాంతో మారుతితో ఆమె పెళ్లి జరిగిపోతుంది. ఫస్టు నైట్ కి ఏర్పాట్లు జరుగుతూ ఉంటాయి. అయినా తాను ప్రేమించిన యువకుడు రాగానే, అతనితో కలిసి అక్కడి నుంచి పారిపోవాలనే ఆలోచనలో బుజ్జి లక్ష్మి ఉంటుంది. ఆ ప్రయత్నంలో ఆమె మారుతికి దొరికిపోతుంది. అప్పుడు అతను ఏం చేస్తాడు? ఆ సంఘటనతో ఆమె జీవితం ఎలాంటి మలుపు తిరుగుతుంది? తాను ఇష్టపడిన యువకుడితో ఆమె ప్రయాణం సాగుతుందా? పెళ్లంటే మారుతికి ఎందుకు ఇష్టం లేదు? అనేది మిగతా కథ.పెళ్లి అంటే ఇష్టం లేని మారుతి తల్లిమాట కాదనలేక పెళ్లి పీటలపైకి వస్తాడు. తాను ప్రేమించిన యువకుడికి దూరం చేసి, మారుతితో తల్లి చేస్తున్న పెళ్లికి అయిష్టంగా తల వంచుతుంది బుజ్జి లక్ష్మి. ఇద్దరికీ ఇది ఎంతమాత్రం ఇష్టం లేని పెళ్లి. అయినా పెద్దల మాట కాదనలేక .. వాళ్ల సంతోషం కోసం ఈ పెళ్లికి అంగీకరిస్తారు. అలాంటి ఈ జంటకి ఎలాంటి అనుభవాలు ఎదురవుతాయి? అనే అంశం చుట్టూ ఈ కథను అల్లుకుంటూ వెళ్లారు. ఇష్టం లేని పెళ్లికి జరుగుతున్న ఏర్పాట్లు .. దగ్గర పడుతున్న ముహూర్తం సమయం .. లవర్ తో లేచిపోవాలనుకున్న బుజ్జి లక్ష్మీ .. అక్కడికి చేరుకోలేకపోతున్న లవర్ .. తప్పనిసరి పరిస్థితులలో తాళి కట్టించుకున్న బుజ్జి లక్ష్మికి సంబంధించిన సన్నివేశాలు ఫస్టాఫ్ లో ఆడియన్స్ ముందుకు వస్తాయి. తనని పెళ్లి చేసుకోవడం బుజ్జి లక్ష్మికి ఇష్టం లేదని మారుతికి, అతనికి తెలియకుండానే పెళ్లి ఏర్పాట్లు జరిగాయని బుజ్జి లక్ష్మికి తెలియడం వంటి సన్నివేశాలతో సెకండాఫ్ పుంజుకుంటుంది.పెళ్లి పీటలపై నుంచి పెళ్లి కూతురు తన లవర్ తో పారిపోవడం వంటి కథలతో చాలానే సినిమాలు వచ్చాయి. అయితే అలా పారిపోవడానికి ముందుగా వేసుకున్న ప్లాన్ ఫెయిల్ కావడంతో పెళ్లి జరిగిపోవడం .. ఆ తరువాత ఫస్టు నైట్ రోజున పారిపోవడానికి ప్రయత్నించి భర్తకి దొరికిపోయినప్పుడు ఎలా ఉంటుంది? అనేది ఈ కథలోని కొత్త పాయింట్ గా చెప్పుకోవచ్చు. ఇక్కడి నుంచి కథ ఎలాంటి మలుపులు తీసుకోనుందా అనే ఒక ఆసక్తి ఆడియన్స్ లో పెరుగుతుంది. పెళ్లికి వచ్చిన బంధువులు అంతా బాగుంటే అక్షతలు వేసి వెళతారు. ఏ మాత్రం తేడా కొట్టినా గుసగుసలతో మానసిక ఆనందాన్ని పొందుతారు. ఇక కొంతమంది మగాళ్లు తాగేసి నానా గందరగోళాన్ని సృష్టిస్తారు. ఈ తరహా సన్నివేశాలను దర్శకుడు సహజత్వానికి దగ్గరగా ఆవిష్కరించాడు. ఈ తరహా కంటెంట్ కి కామెడీ ప్రధానమైన బలమై నిలుస్తుంది. ఆ స్థాయి కామెడీని మాత్రం ఈ కథలో కలపలేకపోయారు.ఇక ఈ కథలో పాత్రలు చాలా ఎక్కువైపోయాయి. అందువలన కొన్ని పాత్రలకి సంబంధించిన వరసలు, ఒక్కసారి చూడటం వలన రిజిస్టర్ కావు. హీరోకి ఒక ఫ్లాష్ బ్యాక్ ఉంటుందిగానీ, అది అంతగా ప్రభావితం చేయలేదు. ఇక ఫస్టు నైట్ కి సంబంధించిన కొత్త మంచం చుట్టూ కూడా కామెడీని వర్కౌ చేయడానికి ప్రయత్నించినట్టుగా కనిపించదు. లవ్ .. ఎమోషన్ .. కామెడీలో ఆశించిన స్థాయి గాఢత కనిపించదు.అంతగా అవసరం లేని ఒకటి రెండు సన్నివేశాలు కూడా కనిపిస్తాయి. దర్శకుడికి ఇది ఫస్టు మూవీ కావడం కూడా అందుకు ఒక కారణమై ఉండొచ్చు. ఆర్టిస్టులు అందరూ బాగా చేశారు. సురేంద్రన్ ఫొటోగ్రఫీ .. భరత్ శంకర్ నేపథ్య సంగీతం .. అశోక్ అర్జునన్ ఎడిటింగ్ ఫరవాలేదు.యువత ప్రేమకి .. ఆకర్షణకి మధ్య గల తేడాను అర్థం చేసుకోవాలి. ప్రేమించిన యువకుడితో వెళ్లిపోవడం కాదు, తనని పోషించే సమర్థత .. బాధ్యత అతనికి ఉన్నాయా లేదా అనేది అమ్మాయిలు ఆలోచన చేయాలి. అమ్మాయిలు ప్రేమించినవారితో కాదు .. ప్రేమ పట్ల నమ్మకం .. ప్రేమపై సరైన అభిప్రాయం ఉన్నవారితో కలిసి అడుగుముందుకు వేయాలి అనే ఒక సందేశం ఈ సినిమాలో కనిపిస్తుంది.టైటిల్ 'మొద రాత్రి' అయినప్పటికీ, ఫ్యామిలీతో కలిసి చూడొచ్చు.

## హీరోయిన్ నుంచి విలన్‌గా..
## ఆ పాత్రకైనా రెడీ అంటున్న భాగ్యశ్రీ



'పాత్ర ఎలాంటిది అన్నది ముఖ్యం కాదు.. నటనకు అవకాశం ఉంటే ఏ తరహా పాత్రనైనా పోషించడానికి సిద్ధం. అవసరమైతే విలన్‌గా కూడా నటిస్తా' అంటున్నది మరాఠీ భామ భాగ్యశ్రీబోర్సే. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తన కెరీర్‌కు సంబంధించిన ఆసక్తికరమైన విషయాలను భాగ్యశ్రీ వెల్లడించింది. 'అసలు నటిని కావాలనే ఆలోచనే నాకు లేదు. బిజినెస్ మేనేజ్‌మెంట్ చదువుకున్న నేను.. అనుకోకుండా మోడలింగ్‌లో అడుగుపెట్టా. అక్కడ మంచి పేరొచ్చింది.సినిమాల్లోకి వెళితే ఇంకా ఫేమ్ వస్తుందని ఫ్రెండ్స్ చెప్పడంతో ప్రయత్నం చేశా. అనుకోకుండా అవకాశాలు వచ్చాయి. అయితే.. ప్రారంభంలోనే ఒడిదుడుకులు ఎదుర్కొన్నా. పెద్దగా ఆడకపోయినా 'కాంత' సినిమా నటిగా నాకు సంతృప్తినిచ్చింది. అందులోని నా నటనను 'మహానటి'లో కీర్తి సురేశ్ నటనతో చాలా మంది పోల్చారు. అది నాకు ఆనందాన్నిచ్చే విషయం. ఇక సక్సెస్ రుచిని చూపించిన సినిమా 'లెనిన్'. ప్రస్తుతం శివకార్తికేయన్‌తో చేస్తున్న 'సెయోన్'లో కూడా నటనకు ఆస్కారమున్న పాత్రే చేస్తున్నా' అంటూ చెప్పుకొచ్చింది భాగ్యశ్రీ బోర్సే.

## వెంకీ 'ఆదర్శ కుటుంబం' నుంచి
## ఫస్ట్ సింగిల్.. డేట్ ఫిక్స్!

విక్టరీ వెంకటేశ్, ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో



వస్తున్న 'ఆదర్శ కుటుంబం' సినిమా నుంచి మేకర్స్ కీలక అప్‌డేట్ ఇచ్చారు. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమాలోని మొదటి పాట 'నారాయణమ్మ'ను రేపు(సెప్టెంబర్ 22న) విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. తమన్ స్వరాలు సమకూరుస్తున్న ఈ చిత్రంలోని 'నారాయణమ్మ' పాటను రామజోగయ్య శాస్త్రి రాశారు. ఇది ఒక మాస్ అండ్ ఎంటర్‌టైనింగ్ సాంగ్‌గా ఉండబోతోందని చిత్రబృందం తెలిపింది. ఆదిత్య మ్యూజిక్ ద్వారా ఈ పాట ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌పై వెంకటేశ్ అభిమానుల్లో, సాధారణ ప్రేక్షకుల్లో భారీ ఆశలు నెలకొని ఉన్నాయి. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వెంకటేశ్ సరసన శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో మరో ఇద్దరు భామలు నివేదా పేతురాజ్, డింపుల్ హయాతి ప్రత్యేక పాత్రల్లో అలరించనున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి, 'ఆదర్శ కుటుంబం' చిత్రాన్ని అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

# ఫోన్లు పక్కనపెట్టి మాట్లాడుకోండి

## - బంధాలపై కాజల్ అగర్వాల్ ఆసక్తికర వ్యాఖ్యలు



నేటి డిజిటల్ యుగంలో సోషల్ మీడియా, స్మార్ట్‌ఫోన్ల ప్రభావం మనుషుల మధ్య బంధాలపై కూడా పడుతోందని నటి కాజల్ అగర్వాల్ అభిప్రాయపడింది. ముఖ్యంగా భార్యాభర్తలు ఒకరితో ఒకరు మాట్లాడుకునేందుకు కూడా తగినంత సమయం కేటాయించకపోవడం ఆందోళన కలిగించే విషయమని ఆమె పేర్కొంది. కలిసి బయటకు వెళ్లిన సమయంలోనూ ఫోన్లలో మునిగిపోవడం వల్ల బంధాల్లో కమ్యూనికేషన్ తగ్గిపోతోందని చెప్పింది.

కాజల్ అగర్వాల్ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాలను కూడా ఈ సందర్భంగా పంచుకుంది. తన భర్త గౌతమ్ కిచ్లూతో కలిసి ప్రతి వారం కనీసం ఒకరోజు డిన్నర్‌కు బయటకు వెళ్తామని ఆమె తెలిపింది. ఆ సమయంలో ఇద్దరం ఫోన్లను పక్కన పెట్టి కేవలం ఒకరితో ఒకరు మాట్లాడుకోవడానికి, కలిసి సమయం గడపడానికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పింది. ప్రస్తుతం చాలా మంది జంటలు కలిసి ఉన్నప్పటికీ ఒకరితో ఒకరు మాట్లాడుకోవడానికి సమయం కేటాయించడం లేదని కాజల్ పేర్కొంది. డిన్నర్ డేట్‌కు వెళ్లినా చేతిలో ఫోన్ పట్టుకుని సోషల్ మీడియా చూస్తూ ఉండటం వల్ల పక్కనే ఉన్న వ్యక్తితోనే దూరం పెరుగుతోందని ఆమె అభిప్రాయపడింది.

భార్యాభర్తల మధ్య మంచి అనుబంధం కొనసాగాలంటే ఒకరి అభిప్రాయాలను మరొకరు వినడం, మాట్లాడుకోవడం చాలా ముఖ్యమని కాజల్ సూచించింది. ఎంత బిజీగా ఉన్నప్పటికీ భాగస్వామితో కొంత సమయం గడపడం, తమ ఆలోచనలు, అనుభవాలను పంచుకోవడం అవసరమని చెప్పింది. తన వివాహ బంధంలో తాము పాటిస్తున్న ఈ విధానం గురించి చెబుతూ.. వారానికి ఒకరోజు ఫోన్‌లకు దూరంగా కలిసి సమయం గడపడం తమకు ఉపయోగపడుతోందని కాజల్ వెల్లడించింది. డిజిటల్ ప్రపంచంలో నిరంతరం గడపడం కంటే నిజ జీవితంలో మన చుట్టూ ఉన్న వ్యక్తులతో మాట్లాడటం, వారి మాటలు వినడం ముఖ్యమనే సందేశాన్ని ఆమె ఇచ్చింది. కాజల్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చకు దారితీశాయి.

సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాలతో పాటు సాధారణ కుటుంబాల్లోనూ స్మార్ట్‌ఫోన్లు, సోషల్ మీడియా వినియోగం పెరిగిన నేపథ్యంలో ఆమె చెప్పిన మాటలు ఆసక్తిని కలిగిస్తున్నాయి.ఇదిలా ఉంటే.. కాజల్ అగర్వాల్ ప్రస్తుతం సినిమాలతో బిజీగా ఉంది. ఆమె నటించిన 'ది ఇండియా స్టోరీ' చిత్రం ఇటీవల ఓటీటీలోకి అందుబాటులోకి వచ్చింది. ఈ సినిమాలో కాజల్ న్యాయవాది పాత్రలో కనిపించింది. ఆహార కల్తీ, వ్యవసాయంలో పురుగుమందుల వినియోగం వంటి అంశాల చుట్టూ ఈ సినిమా కథ కొనసాగుతుంది

# ప్రారంభమైన 'ది ప్యారడైజ్' జాతర..
## రికార్డు స్థాయిలో అడ్వాన్స్ బుకింగ్స్!

నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న 'ది ప్యారడైజ్' చిత్రంపై నెలకొన్న భారీ అంచనాలకు తగ్గట్టే అడ్వాన్స్ బుకింగ్స్‌కు అద్భుతమైన స్పందన లభిస్తోంది. ఈ గురువారం సినిమా విడుదల కానుండగా, నైజాం ప్రాంతంలో ప్రారంభమైన బుకింగ్స్ పోటెత్తాయి. బుకింగ్స్ మొదలైన కొద్ది సమయంలోనే రూ.1 కోటికి పైగా గ్రాస్ వసూలైనట్లు ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి. గత రాత్రి డిస్ట్రిక్ట్ యాప్‌లో అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభించగా, ప్రేక్షకుల నుంచి అనూహ్యమైన స్పందన వచ్చింది. లక్షకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు సమాచారం. దీంతో పలు షోలు ఇప్పటికే హౌస్‌ఫుల్ బోర్డులతో నిండిపోవడం సినిమాపై ఉన్న క్రేజ్‌ను స్పష్టం చేస్తోంది. మిగిలిన ప్రాంతాల్లోనూ పూర్తి స్థాయి అడ్వాన్స్ బుకింగ్స్ త్వరలోనే ప్రారంభం కానున్నాయి. ఈ స్థాయిలో స్పందన రావడం చూసి చిత్రబృందం హర్షం వ్యక్తం చేస్తోంది. బ్లాక్‌బస్టర్ చిత్రం 'దసరా' తర్వాత నాని, శ్రీకాంత్ ఓదెల కలయికలో వస్తున్న రెండో సినిమా కావడంతో 'ది ప్యారడైజ్'పై మొదటి నుంచి అంచనాలు ఆకాశాన్నంటాయి. ఈసారి కూడా విభిన్నమైన కథాంశంతో, బలమైన యాక్షన్ ఎలిమెంట్స్‌తో శ్రీకాంత్ ఓదెల ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు తెలుస్తోంది. నాని గత చిత్రాలకు భిన్నమైన గెటప్‌లో కనిపించనుండటం కూడా అభిమానుల్లో ఆసక్తిని రెట్టింపు చేసింది. ఈ చిత్రంలో నానికి జోడీగా కయాదు లోహర్ నటిస్తుండగా, సీనియర్ నటుడు మోహన్ బాబు ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారు. సినిమా ప్రమోషన్లలో భాగంగా ఈరోజు హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో చిత్ర ప్రీ-రిలీజ్ వేడుకను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ ఈవెంట్‌లో అభిమానుల కోసం ఓ ప్రత్యేక




సర్‌ప్రైజ్ కూడా ప్లాన్ చేసినట్లు చిత్రబృందం ప్రకటించడంతో ఈ కార్యక్రమంపై కూడా ఆసక్తి పెరిగింది.

రాఘవ్ జుయల్, తనికెళ్ల భరణి కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంగీత సంచలనం అనిరుధ్ రవిచందర్ అందించిన సంగీతం మరో ప్రధాన ఆకర్షణగా నిలవనుంది.

# ఉగ్రరూపంలో రష్మిక మందన్న..
## - 'మైసా' టీజర్ అదిరింది!

నేషనల్ క్రష్ రష్మిక మందన్న కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న పాన్-ఇండియా యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' (వీఎయిఖు) సినిమాకు సంబంధించిన టీజర్ తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. రవీంద్ర పుల్లె దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అన్‌ఫార్ములా ఫిల్మ్స్ పతాకంపై అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు.కొత్త సినిమాలు చూడండిఇప్పటివరకు రొమాంటిక్ మరియు క్యూట్ పాత్రలతో అలరించిన రష్మిక, ఈ చిత్రంలో పూర్తిగా రూపురేఖలు మార్చుకుని ఒక గిరిజన గోండు మహిళగా ఉగ్రరూపంలో కనిపిస్తోంది. "అలసిపోయాను, ఆగిపోయాను, ఓడిపోయాను" అంటూ రష్మిక వాయిస్‌ఓవర్‌తో ప్రారంభమయ్యే ఈ టీజర్ ఆద్యంతం ఉత్కంఠను రేకెత్తిస్తుంది. తండ్రి కోసం, తన మనుషుల హక్కుల కోసం ఒక సాధారణ గిరిజన యువతి తిరగబడే తీరును ఈ చిత్రంలో హృద్యంగా ఆవిష్కరిస్తున్నారు. ఈ టీజర్‌లో రష్మిక బైక్ రైడింగ్ చేయడంతో పాటు, ప్రమాదకరమైన అండర్‌వాటర్ యాక్షన్ సీక్వెన్స్‌లు మరియు మడ్ ఫైట్స్‌లో పాల్గొని ఆశ్చర్యపరిచింది. తెరపై ఈ పోరాట దృశ్యాలు ఎంత సహజంగా కనిపిస్తున్నాయో, వాటి వెనుక రష్మిక పడిన కష్టం కూడా అంతే స్థాయిలో ఉందని చెప్పవచ్చు.తాజా సినిమాలు చూడండిషూటింగ్‌లో భాగంగా దాదాపు ఎనిమిది గంటల పాటు నీటిలో అలాగే బురదలో సాహసోపేతమైన స్టంట్స్ చేసినట్లు ఆమె స్వయంగా వెల్లడించారు. ఈ సినిమాకు జేక్స్ బిజోయ్ అందిస్తున్న నేపథ్య సంగీతం (BGM) మరియు శ్రేయాస్ కె. కృష్ణ సినిమాటోగ్రఫీ ప్రధాన హైలైట్‌గా నిలవనున్నాయి. టీజర్‌లోని ప్రతీ విజువల్ హాలీవుడ్ రేంజ్ స్టాండర్డ్స్‌తో తెరకెక్కించినట్లు అనిపిస్తోంది. ఈ చిత్రంలో ఈశ్వరి రావు, రావు రమేష్, సముద్రఖని, రాహుల్ రవీంద్రన్ వంటి దిగ్గజ నటులు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మహిళా ప్రాధాన్యత కలిగిన ఈ కథాంశం ప్రేక్షకులకు ఒక సరికొత్త సినిమాటిక్ అనుభూతిని పంచడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ పాన్-ఇండియా చిత్రం తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో నవంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.



# వీర హనుమాన్ కాలనీలో ఘనంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు

**కుటుంబ సమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన కాంగ్రెస్ నాయకుడు మ్యాడం బాలకృష్ణ**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) మెదక్ పట్టణంలోని వీర హనుమాన్ కాలనీలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం కాంగ్రెస్ నాయకుడు మ్యాడం బాలకృష్ణ కుటుంబ సమేతంగా పాల్గొని గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులతో కలిసి గణేశుడిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలనీ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి పూజలు, హారతులు సమర్పించారు.గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వీర హనుమాన్ కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తున్న నిర్వాహకులను, కాలనీ ప్రజలను మ్యాడం బాలకృష్ణ అభినందించారు.

# భర్తను హత్య చేసిన భార్యకు జీవిత ఖైదు

**పకడ్బందీ దర్యాప్తు.. బలమైన సాక్ష్యాధారాలతో నిందితురాలికి శిక్ష**

**జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు,**




మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) మనోహరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2021లో జరిగిన హత్య కేసులో నిందితురాలికి జిల్లా ప్రధాన న్యాయస్థానం జీవిత ఖైదుతో పాటు రూ.6,000 జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ తెలిపారు.ఎస్పీ వివరాలు వెల్లడిస్తూ.. పార్కిబండ గ్రామానికి చెందిన మురళికి, మనోహరాబాద్‌కు చెందిన విజయలక్ష్మితో సుమారు 22 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య కుటుంబ విషయాలపై తరచూ వివాదాలు జరుగుతుండటంతో మనోహరాబాద్ పోలీస్ స్టేషన్‌లో పలుమార్లు కౌన్సెలింగ్ నిర్వహించారు. గ్రామ పెద్దల సమక్షంలో కూడా పంచాయతీలు నిర్వహించి ఇరువురికి నచ్చజెప్పారు.మురళికి సుమారు 18 నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో కాలు విరగడంతో అప్పటి నుంచి పనికి వెళ్లకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ విషయమై భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి.ఈ క్రమంలో 15.03.2021 రాత్రి మురళి మంచంపై నిద్రిస్తున్న సమయంలో విజయలక్ష్మి రోకలిబండతో అతనిపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు 16.03.2021న అప్పటి మనోహరాబాద్ ఎస్‌ఐ రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.అప్పటి దర్యాప్తు అధికారి తూప్రాన్ సీఐ స్వామిగౌడ్ పూర్తి స్థాయిలో సాక్ష్యాధారాలను సేకరించి న్యాయస్థానంలో ఛార్జిషీట్ దాఖలు చేశారు. ప్రస్తుత దర్యాప్తు అధికారి వెంకట రాజాగౌడ్, ప్రస్తుత మనోహరాబాద్ ఎసై సుభాష్ గౌడ్ సాక్షులను న్యాయస్థానంలో ప్రవేశపెట్టి కేసు విచారణను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేష్ బలమైన వాదనలు వినిపించారు. పూర్తి సాక్ష్యాధారాలను పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ నిందితురాలికి జీవిత ఖైదుతో పాటు రూ.6,000 జరిమానా విధించారు.కేసు విచారణలో కోర్టు లైజన్ అధికారులు ఎస్‌ఐ విఠల్, కానిస్టేబుల్ రవీందర్ గౌడ్, సీడీఓ మహిపాల్ రెడ్డి సహకరించారు. నిందితురాలికి శిక్ష పడేలా సమర్థవంతంగా దర్యాప్తు చేసి, పటిష్ఠమైన సాక్ష్యాధారాలను న్యాయస్థానంలో సమర్పించిన దర్యాప్తు అధికారులు, కోర్టు లైజన్ అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

# శ్రీ సీతారామ స్వామి గణేష్ మండలి ఆధ్వర్యంలో అన్న ప్రసాన కార్యక్రమం


**అన్న ప్రసాన దాత మాజీ సర్పంచ్ తిరు నగరి గోదావరి వెంకటరాములు**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) కొల్చారం మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామంలో సోమవారం నాడు శ్రీ సీతారామస్వామి గణేష్ మండలి ఆధ్వర్యంలో అన్న ప్రసాన కార్యక్రమం నిర్వహించిన శ్రీ సీతారామ స్వామి గణేష్ మండలి సభ్యులు ఈ అన్న ప్రసాన దాత అయినటువంటి కిష్టాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ తిరునగరి గోదావరి వెంకటరాములు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నమని మాజీ సర్పంచ్ తిరునగరి గోదావరి వెంకటరాములు తెలిపారు ఈ అన్న ప్రసాన కార్యక్రమాన్ని కిష్టాపూర్ గ్రామ సర్పంచ్ సాదుల స్వప్న ఊశయ్య చేతుల మీదుగా ప్రారంభించారు కావున కిష్టాపూర్ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా శ్రీ సీతారామ స్వామి గణేష్ మండలి సభ్యులు కోరారు ఈ అన్నదాన ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు గ్రామ సర్పంచ్ సాదుల స్వప్న ఊశయ్య, మాజీ సర్పంచ్ తిరునగరి గోదావరి వెంకట రాములు, పోలీస్ హెడ్ కానిస్టేబుల్ సురేందర్, శ్రీ సీతారామ గణేష్ మండలి సభ్యులు భక్తులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# సింహాచలంలో సమృద్ధి దామెరా కూచిపూడి నృత్య ప్రదర్శన

**నృత్య మహోత్సవంలో పాల్గొన్న సమృద్ధి దామెరా**



మల్కాజ్గిరి( ప్రశ్న న్యూస్) మల్కాజిగిరికి చెందిన శ్రీ దుర్గా నృత్యకళానిలయం ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న కూచిపూడి నృత్య కళాకారిణి సమృద్ధి దామెరా సింహాచలంలోని శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో నిర్వహించిన కూచిపూడి నృత్య మహోత్సవంలో పాల్గొని తన ప్రతిభను చాటుకుంది.నృత్య గురువు ఏ.ఎన్. శ్రీదేవి, ఎం.ఏ. శిక్షణలో సమృద్ధి దామెరా కూచిపూడి నృత్య ప్రదర్శనతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి వారి సన్నిధిలో నృత్య ప్రదర్శన ఇవ్వడం తనకు ప్రత్యేక అనుభూతిగా నిలిచిందని సమృద్ధి దామెరా పేర్కొంది.సంప్రదాయ కూచిపూడి నృత్యంలోని హావభావాలు, లయ, అభినయాన్ని సమన్వయం చేస్తూ ఆమె ప్రదర్శన సాగింది. ప్రదర్శన అనంతరం నిర్వాహకులు పాల్గొన్న కళాకారులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సమృద్ధి దామెరా నృత్య ప్రతిభను పలువురు అభినందించారు.

# శేరిలింగంపల్లిలో ఇందిరమ్మ టవర్స్‌కు శ్రీకారం

**ఏడాదిలో లక్ష ఇళ్ల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం.. అర్హులకు లక్కీడిప్ ద్వారా కేటాయింపు**






శేర్లింగంపల్లి (ప్రశ్న న్యూస్) శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని రాయదుర్గం గ్రామం మల్కం చెరువు వెనుక 2.85 ఎకరాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి సోమవారం భూమిపూజ నిర్వహించారు. హౌసింగ్, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ బోగారపు దయానంద్‌గుప్తా, శేర్లింగంపల్లి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి జగదీశ్వర్ గౌడ్, యాదవ కోఆపరేటివ్ చైర్మన్ రఘునాథ్ యాదవ్ తదితరులతో కలిసి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టడం సంతోషంగా ఉందన్నారు. ఏడాదిలో నిర్మాణాలు పూర్తి చేసి గృహప్రవేశాలు జరిగేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. మొదటి దశలో 480, రెండో దశలో 680 ఇళ్లను నిర్మించనున్నట్లు చెప్పారు.

## ఒక్కో టవర్‌లో 120 ఫ్లాట్లు

మొదటి దశలో నాలుగు టవర్లను నిర్మించనుండగా ఒక్కో టవర్‌లో 120 ఫ్లాట్లు ఉంటాయని గాంధీ తెలిపారు. ఒక్కో ఫ్లాట్ సుమారు 525 నుంచి 528 చదరపు అడుగుల విస్తీర్ణంలో బెడ్‌రూమ్, హాల్, కిచెన్‌తో నిర్మించనున్నట్లు చెప్పారు. లబ్ధిదారుడు రూ.6 లక్షలు చెల్లించాల్సి ఉండగా, ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీతో పాటు ఉచితంగా భూమిని అందిస్తుందని తెలిపారు. ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్న ఈ ఇళ్లలో లబ్ధిదారుడి పేరుతో అన్‌డివైడెడ్ షేర్ కింద సుమారు 20 నుంచి 25 గజాల స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు వెల్లడించారు. అర్హులైన పేదలకు పారదర్శకంగా లక్కీడిప్ ద్వారా ఇళ్లను కేటాయించనున్నట్లు తెలిపారు.

## ట్యాక్సీ డ్రైవర్లకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి

ఆటో రిక్షా, ట్యాక్సీ నడుపుతూ జీవనం సాగించే వారికి కూడా ఇందిరమ్మ టవర్స్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని గాంధీ కోరారు. నాలుగు చక్రాల వాహనం ఉన్న కారణంగా వారు అనర్హులు కాకుండా నిజమైన అర్హతలను పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి ట్యాక్సీ డ్రైవర్లకు కూడా అవకాశం కల్పిస్తామని తెలిపినట్లు గాంధీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్మయి, హౌసింగ్ పీడీ నాయక్, ఆర్డీవో శ్రీధర్, తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేశ్‌గౌడ్, నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, నీరుడి గణేష్ ముదిరాజ్, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# సీఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రజావాణి



శేర్లింగంపల్లి (ప్రశ్న న్యూస్) సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులు, వినతులను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.ఈ కార్యక్రమంలో మొత్తం 41 ఫిర్యాదులు అందగా, అత్యధికంగా టౌన్ ప్లానింగ్ శాఖకు సంబంధించినవే ఉన్నాయి. శాఖల వారీగా టౌన్ ప్లానింగ్‌కు 36, ఇంజినీరింగ్‌కు 2, ఎలక్ట్రికల్‌కు 1, ల్యాండ్ అక్విజిషన్‌కు 1, స్పోర్ట్స్‌కు 1 ఫిర్యాదు అందాయి.అందిన వినతులను సంబంధిత శాఖలకు పంపించి పరిశీలనకు నమోదు చేశారు. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి, సమస్య స్వభావాన్ని గుర్తించి నిర్దేశిత గడువులో చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ప్రజావాణిలో నమోదైన ప్రతి ఫిర్యాదుకు ప్రత్యేక గ్రీవెన్స్ ఐడీ, ట్రాకింగ్ లింక్ కేటాయించడంతో ప్రజలు తమ ఫిర్యాదు పురోగతిని తెలుసుకునే అవకాశం కల్పించారు. ప్రజల సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చే వేదికగా ప్రజావాణి కొనసాగుతుందని సీఎంసీ అధికారులు తెలిపారు.

# మహిళపై దాడి డీఎస్పీ విలేకరుల సమావేశం




శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) శ్రీ కాళహస్తిలో నిన్న అనూష అనే మహిళపై సురేష్ అనే వ్యక్తి దాడి చేయడంపై మహిళా రిపోర్టర్ హిమబిందు సోషల్ మీడియా ద్వారా అన్యాయాన్ని ప్రశ్నించడంపై, సురేష్ అనే వ్యక్తి హిమబిందు ఇంటి వద్దకు వెళ్లి ఇంటిలో ఉన్న వస్తువులను ధ్వంసం చేయడంపై ఆమె శ్రీకాళహస్తి టూ టౌన్ పోలీస్ స్టేషన్ నమోదు చేసింది,ఈ సందర్భంగా కేసు నమోదు చేసిన వెంటనే పోలీసులు సురేష్ అనే వ్యక్తిని అరెస్టు చేసి న్యాయమూర్తి వద్దకు హాజరు పరిచి రిమాండ్ తరలించారు, ఈ సందర్భంగా శ్రీకాళహస్తి డిఎస్పిఎన్ఎస్ మూర్తి మాట్లాడుతూ నిన్న సురేష్ అనే వ్యక్తి శ్రీకాళహస్తిలో పనిచేసే లేడీ రిపోర్టర్ హిమబిందుపై దౌర్జన్యం చేయడం,ఇంటిలో ఉన్న వస్తువులను నాశనం చేయడం వంటి అంశాలు చేయడంతో,ఆమె టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఆశ్రయించి కేసు నమోదు చేసిందని, ఆమె ఇచ్చిన కేసు పై విచారణ చేపట్టి సురేష్ అనే వ్యక్తి గత సంవత్సరం గా అనూష అనే మహిళను హింసిస్తున్నాడని విచారణలో తేలింది,సురేష్ అనే వ్యక్తిని రాత్రి శ్రీకాళహస్తి కోర్టు సముదాయంలో ఉన్న న్యాయమూర్తి వద్ద హాజరు పరిచి రిమాండ్కు తరలించామని, మహిళలకు ఎక్కడ ఎటువంటి ఆపద కలిగిన వెంటనే శ్రీకాళహస్తి డివిజన్లోని పోలీసులు తగువిధంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగే విధంగా కార్యాచరణ చేపట్టాలని సందర్భంగా ఆయన మహిళలకు తెలియజేశారు ఇకపై శ్రీకాళహస్తిలో మహిళలపై ఎవరైనా అరాచకాలు అన్యాయాలు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు వెనవెంటనే శ్రీకాళహస్తి డివిజన్లను పోలీసులు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆకతాయిలకు హెచ్చరికలు జారీ చేశారు.

# కిరాణా, బేకరీ షాపుల్లో తనిఖీలు

**గంజాయి, మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు**

ఎల్లారెడ్డిపేట (ప్రశ్న న్యూస్) బొప్పాపూర్, గొల్లపల్లి బస్టాండ్ ఆవరణంలో కిరాణా షాపులు, బేకరీ షాపుల్లో పోలీసులు డాగ్ స్క్వాడ్ తో తనిఖీలు నిర్వహించారు. ఎస్పీ ఆదేశాల మేరకు కిరాణా షాపులు, బేకరీ, ఇతరత్రా షాపులలో గంజాయి ఇతర మత్తు పదార్థాలు అమ్మినట్లయితే షాపు యజమానుల పైన కఠినమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ఈ యొక్క తనిఖీల్లో డాగ్ స్క్వాడ్ బృందంతో కానిస్టేబుల్ సదుర్ల సతీష్ పాల్గొన్నారు.



# ఎంఎంసి కమీషనర్ తో ఎమ్మెల్యే శ్రీగణేష్ భేటీ



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలో అసంపూర్తిగా నిలిచిపోయిన నూతన కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి)నిధుల నుంచి రూ 8.50 కోట్లు మంజూరైన సందర్భంగా పనులను త్వరగా ప్రారంభించి,వేగవంతంగా పూర్తి చేయాలని అలాగే మోండా డివిజన్ లో పలు అభివృద్ధి పనుల గురించి కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి ని కోరారు.అలాగేనియోజకవర్గంలోని 8 వార్డుల పరిధిలో అర్థాంతరంగా నిలిచి పోయి ఉన్న సామాజిక భవనాల పూర్తి,అదనపు గదులు, మరమ్మత్తులు మల్టీపర్పస్ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం (జీవో ఆర్టీ.నెంబర్ .854) ద్వారా రూ 8.50 కోట్లకు అనుమతులు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలో పేద బలహీన వర్గాలకు చెందిన ప్రజలు శుభకార్యక్రమాలు, సామాజిక సమావేశాలు నిర్వహించుకోవడానికి కమ్యూనిటీ హాళ్లు ఎంతో దోహదపడుతాయి,కాబట్టి నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగవంతం చేయాలని కమిషనర్ ను కోరినట్లు ఎమ్మెల్యే శ్రీ గణేష్ తెలిపారు.కంటోన్మెంట్ బోర్డు నుండి ఎన్‌ఓసీ లు తెచ్చుకోవడం,జెఎన్టీయూహెచ్ ద్వారా స్ట్రక్చరల్ స్టెబిలిటీ సర్టిఫికెట్లు పొందడం వంటి ప్రక్రియలను తొందరగా పూర్తి చేసి,పనులు ప్రారంభమయ్యేలా చూడాలని కోరారు.అలాగే నియోజకవర్గ పరిధిలోని ఇతర అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై కమిషనర్ తో విస్తృతంగా చర్చించారు.ఈ అంశాలపై కమీషనర్ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే శ్రీ గణేష్ తెలిపారు.హైదరాబాద్ జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ అశోక్ చక్రవర్తితో ఇందిరమ్మ ఇండ్లపై ఎమ్మెల్యే చర్చ:రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ ఇండ్ల' నిర్మాణ పథకం కింద కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలోని అర్హులైన పేదలకు ఇండ్ల నిర్మాణ పనులను వెంటనే వేగవంతం చేయాలని కంటోన్మెంట్ శాసనసభ్యులు శ్రీగణేష్ హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ కి సూచించారు.ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ (పిడి) అశోక్ చక్రవర్తితో ఎమ్మెల్యే శ్రీగణేష్ శనివారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు,స్థలాల పరిశీలన,నిర్మాణ ప్రక్రియలో తలెత్తుతున్న వివిధ సాంకేతిక, పరిపాలనాపరమైన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.పేదల సొంతింటి కలను నిజం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు.కంటోన్మెంట్ పరిధిలో ఇండ్ల నిర్మాణ ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగకుండా, అధికారుల సమన్వయంతో పనులు తొందరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు స్పష్టం చేశారు. అర్హులైన లబ్ధిదారులకు పథకం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చేలా చూడాలని ఆదేశించారు.

# రైతులకు ఉత్తమ సేవలు అందించాలి

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**40 మందికి ఇన్‌పుట్ డీలర్లకు సర్టిఫికెట్ల పంపిణీ, అభినందన**



సిరిసిల్ల(ప్రశ్న న్యూస్) ఇన్‌పుట్ డీలర్ల డిప్లొమా కోర్సు పూర్తి చేసుకున్న అభ్యర్థులు రైతులకు ఉత్తమ సేవలు అందించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు.డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్టెన్షన్ సర్వీస్ ఫర్ ఇన్‌పుట్ డీలర్ల (డీఏఈఎస్ఐ ) కోర్సు జిల్లాలోని 40 మంది అభ్యర్థులు పూర్తి చేసుకోగా, వారికి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ సోమవారం సర్టిఫికెట్లు పంపిణీ చేసి, అభినందించారు. కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ

డీఏఈఎస్ఐ కోర్సు, లేదా ఇన్‌పుట్ డీలర్ల కోసం డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్, వ్యవసాయంలో ఇన్‌పుట్ డీలర్ల సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించడానికి ఒక సంవత్సరం డిప్లొమా ప్రోగ్రామ్ రూపొందించి, మేనేజ్ సంస్థ ఆద్వర్యంలో ఎస్ఏఎంఈటీఐ వారి నుంచి శాస్త్రవేత్తలు, అర్హత కలిగిన నిపుణుల ఆధ్వర్యంలో శిక్షణా అందించారని తెలిపారు.నేల ఆరోగ్య నిర్వహణ వ్యవసాయ ఉత్పాదకతలో నేల ఆరోగ్యం - దాని ప్రాముఖ్యతను అర్థం చేసుకోవడం, ఇంటిగ్రేటెడ్ తెగులు నిర్వహణ పద్ధతులను నేర్చుకోవడం, వ్యవసాయ పనిముట్లు - పరికరాలు యంత్రాలపై పరిచయం, విస్తరణ విధానాలు పద్ధతులు: రైతులతో సమర్థవంతంగా సంభాషించడానికి నైపుణ్యాలను అభివృద్ధి చేయడం, విత్తన ఉత్పత్తి - నిర్వహణను అర్థం చేసుకోవడం, నీటిపారుదల పద్ధతులను నేర్చుకోవడంపై శిక్షణ అందించారని వివరించారు. ఈ కోర్సు విజయవంతంగా పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేసి, రైతులకు ఉత్తమ సేవలు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం తదితరులు పాల్గొన్నారు.

# స్పెషల్ బ్రాంచ్ నిఘా ఎక్కడ.?

- కిసర ఏసీబీ దెబ్బ..ఖాకి తీరుపై మచ్చ -5 లక్షల లంచం తీసుకుంటూ ఎస్ఐ, సిఐ ఏసీబీకి చిక్కడం రాష్ట్రంలో సంచలనం
- పోలీస్‌స్టేషన్‌లలోనే బెయిల్‌కు 'రేట్' నిర్ణయిస్తున్నారా.? - సోదాల్లో భారీగా నగదు, బంగారం, ఆస్తుల పత్రాలు లభించినట్లు సమాచారం
- స్టేషన్ స్థాయిలో  పర్యవేక్షణపై ఎస్ బి పై ప్రశ్నలు - పోలీస్ స్టేషన్లో జరుగుతున్న వ్యవహారాలపై స్పెషల్ బ్రాంచ్ నిఘా శూన్యం
- స్టేషన్ ఎసిపి కార్యాలయాలపై  ఉన్నతాధికారు నిఘా ఉండదా.? - కీసరలో ప్రజలు పటాకులు కాల్చారు అంటే పోలీసులు ఎంత టార్చర్ పెట్టారో.?
- స్థానిక ప్రజలు టపాసులు కాల్చడంతో పోలీసు శాఖలో ఉన్నత అధికారులు ఆత్మ పరిశీలన చేసుకునేనా.?

"పోలీసులు అంటే ప్రజలకు ఒక నమ్మకం, ఒక ధైర్యం, తమకు వచ్చిన ఆపదలో పోలీసులను ఆశ్రయిస్తే తమకు రక్షణతో పాటు న్యాయం జరుగుతుందనే ప్రజల నమ్మకాన్ని కొంతమంది పోలీసు అధికారులు కొన్ని పోలీస్ స్టేషన్లలో జరుగుతున్న వ్యవహారాలు చూస్తే ప్రజలకు పోలీసులు అంటే ఏమాత్రం విశ్వాసం లేకుండా పోతోంది. ఇద్దరు అధికారులు ఏసీబీలో దొరికారు అనగానే కీసరలో ప్రజలు టపాసులు కాల్చారు పండుగ చేర్చుకున్నారు. అంటే ఆ అధికారులు స్థానిక ప్రజలను ఎన్ని ఇబ్బందులకు పెట్టారో రక్షక బటులై వాళ్లను కాపాడవలసిన వారు భక్షక బటులై ప్రజలకు ప్రత్యక్ష నరకమే చూపించాలన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరి ఇంత జరుగుతుంటే ఉన్నత అధికారుల పర్యవేక్షణ ఎక్కడ.? స్పెషల్ బ్రాంచ్ అధికారుల నిఘా ఎక్కడ.? స్పెషల్ బ్రాంచ్ అధికారులు కూడా చేతులు కలిపారా.? అంటే ప్రజలకు అందించవలసిన న్యాయబద్ధమైన పాలన డబ్బులకు, రాజకీయ నాయకులకు దాసోహం అయిపోవడంతో సామాన్య ప్రజలకు పోలీసు అంటే గౌరవం పూర్తిగా సన్నగిల్లుతోంది. ఇదే పరిస్థితి మరికొంత కాలం కొనసాగితే తరువాత పరిస్థితి ఏమిటి.? అన్న దానిపై ఇటు ప్రభుత్వం, అటు ఉన్నత అధికారులు ఆత్మ పరిశీలన చేసుకునే పరిస్థితి నెలకొన్నది. కేవలం కీసర పోలీస్ స్టేషన్లోనే ఈ పరిస్థితి లేదు. దాదాపు రాష్ట్రవ్యాప్తంగా అనేక పోలీస్ స్టేషన్లో ఇదే పరిస్థితి నెలకొన్నదన్న ఆరోపణలు ఉన్నాయి. ఒక్కసారి మానవ హక్కుల కమిషన్ కు వెళ్లి ఎన్ని ఫిర్యాదులు పోలీసు శాఖపై వస్తున్నాయో ఆరా తీస్తే ఉన్నత అధికారులకు వాస్తవాలు తెలుస్తాయి. పోలీసు ఉన్నత అధికారులు ఆ శాఖలోని కిందిస్థాయి అధికారుల అవినీతి, అక్రమాలు, బాధ్యతారాహిత్యం, నిర్లక్ష్యాలను బయటికి రాకుండా కాపాడుతుంటే లోలోపల అదే లోపాలు రాచపుండు(క్యాన్సర్) వలె వ్యాప్తి చెంది పోలీసు వ్యవస్థనే ఏమి చేస్తాయో వాళ్లే ఊహించుకోవాలి. ఈరోజు సామాన్యుడికి పోలీస్ స్టేషన్లో న్యాయం జరుగుతుంది, న్యాయం చేస్తాం అని గుండెల మీద చెయ్యి వేసుకుని చెప్పే ఎంతమంది పోలీసులు ఉన్నారు.? వాళ్లకే తెలియాలి. ఏది ఏమైనా ఈ రోజుల్లో పోలీస్ స్టేషన్ అంటే కేవలం డబ్బు, రాజకీయ పలుకుబడి ఉన్నవాడికే న్యాయం జరుగుతుందన్న పూర్తి విశ్వాసం పేద సామాన్య మధ్య తరగతి ప్రజలలో నిండిపోయింది. మరి ఇలాంటి పరిస్థితిని పోలీసు ఉన్నత అధికారులు ఎలా దూరం చేస్తారు వేచి చూద్దాం"

మేడ్చల్( ప్రశ్న న్యూస్ ) కీసర పోలీస్‌స్టేషన్‌లో చోటుచేసుకున్న ఏసీబీ ట్రాప్ ఘటన పోలీస్ శాఖలో తీవ్ర చర్చకు దారితీసింది. స్టేషన్ బెయిల్ విషయంలో లంచం డిమాండ్ చేశారన్న ఫిర్యాదుపై రంగంలోకి దిగిన అవినీతి నిరోధక శాఖ.. కీసర సీఐ ఆర్కపల్లి ఆంజనేయులు, ఎస్ఐ డ్యాపా జ్ఞానేందర్‌రెడ్డిని అరెస్ట్ చేసింది. ఎస్ఐ రూ.5 లక్షలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారని అధికారులు వెల్లడించారు.

### పోలీస్ స్టేషన్ లలో బెయిల్‌కు 'రేట్' ఉందా.?





ఏసీబీ వివరాల ప్రకారం.. కీసర పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఓ పిడిఎస్ బియ్యం కేసులో స్టేషన్ బెయిల్ మంజూరు చేయడంతో పాటు ఫిర్యాదుదారుడిని, అతని స్నేహితుడిని వేధించకుండా ఉండేందుకు లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో రూ.5 లక్షలు తీసుకుంటుండగా ఎస్ఐ జ్ఞానేందర్‌రెడ్డి ఏసీబీ వలలో చిక్కారు. ఈ డబ్బు సీఐ ఆంజనేయులు సూచనల మేరకు తీసుకున్నట్లు ఆరోపణలు రావడంతో ఆయనను కూడా అదుపులోకి తీసుకున్నారు. కేసు ప్రస్తుతం దర్యాప్తులో ఉంది.

### కీసర చెరువు వద్ద ట్రాప్.. తప్పించుకునే యత్నం

వినాయక నిమజ్జనం బందోబస్తు విధుల్లో ఉన్న సమయంలో ఎస్ఐ వద్దకు డబ్బు తీసుకెళ్లినట్లు ఇతర పత్రికలు వెల్లడించాయి. కీసర చెరువు సమీపంలో కారులో నగదు స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారని ఏసీబీ అధికారులు తెలిపారు.

### సోదాల్లో నగదు, బంగారం, ఆస్తుల పత్రాలు

ట్రాప్ అనంతరం ఇద్దరు అధికారుల నివాసాల్లో ఏసీబీ సోదాలు నిర్వహించినట్లు సోదాల్లో నగదు, బంగారు ఆభరణాలు, భూములు, ప్లాట్లకు సంబంధించిన పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు ఏసీబీ తెలిపింది. ఈ ఆస్తులన్నీ అక్రమంగా సంపాదించినవేనని తేలిందని మాత్రం ఇప్పుడే చెప్పలేం అని వాటి మూలాలు, ఆదాయ వనరులపై దర్యాప్తు కొనసాగాల్సి ఉందన్నది.

### ఇక్కడే అసలు ప్రశ్న మొదలు..

కీసర ఘటనతో ఇప్పుడు కేవలం ఒక లంచం కేసు మాత్రమే కాదు, పోలీస్‌స్టేషన్‌లో ప్రజలకు జరుగుతున్న అన్యాయం, అక్రమాలు అని ఉన్నత అధికారుల, స్పెషల్ బ్రాంచ్ అధికారుల పర్యవేక్షణ  ఎలా పనిచేస్తోంది.? అనే ప్రశ్న కూడా తెరపైకి వచ్చింది. ఒక పోలీస్‌స్టేషన్‌లో అధికారులు, సిబ్బంది పనితీరుపై స్పెషల్ బ్రాంచ్ అధికారుల నిఘా ఉండాల్సిన పరిస్థితి లేకుండా పోయిందని విమర్శలు వినిపిస్తున్నాయి.

### స్పెషల్ బ్రాంచ్ నిఘా ఎక్కడ.?

పోలీస్‌స్టేషన్లలో ప్రజలకు అందుతున్న సేవలు, స్థానిక పరిస్థితులు, అసాంఘిక కార్యకలాపాలు తదితర అంశాలపై సంబంధిత నిఘా విభాగాలు సమాచారాన్ని ఉన్నతాధికారులకు



చేరవేయడం స్పెషల్ బ్రాంచ్ అధికారుల కీలకమైన బాధ్యత. కీసర ఘటన నేపథ్యంలో ఎస్ బి పై కూడా సమీక్ష అవసరమా.? అనే ప్రశ్న ఇప్పుడు వినిపిస్తోంది

### ఏసీబీ దాడి జరిగే వరకు ఏం జరిగింది.?

కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో సిఐ, ఎస్ఐ లపై ఫిర్యాదులు ముందుగానే ఉన్నాయా.?ఉంటే అవి ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లాయా.?వెళ్లకపోతే ఎందుకు వెళ్లలేదు.?వెళితే ఉన్నత అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదు.?స్టేషన్ లలో సిబ్బంది అధికారులపై నిఘా నివేదికలు ఎలా ఉన్నాయి.?సమాజంలో మాఫియాలకు పోలీసులు ఎందుకు సహకరిస్తున్నారు.? ఈ ప్రశ్నలకు  ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన సమాధానం రావాల్సి ఉంది.ప్రజల్లో చర్చకు దారితీసిన ఘటన సీఐ, ఎస్ఐ అరెస్ట్ వార్త వెలువడిన అనంతరం కీసర పోలీస్‌స్టేషన్ వద్ద కొందరు స్థానికులు టపాసులు కాల్చి తమ స్పందనను వ్యక్తం చేసినట్లు సామాజిక మధ్యమాలలో వీడియోలు రావడంతో పోలీసుల పాలన ఎంత భయంకరంగా ఉందో అన్న భయాందోళన ప్రజలను కలుగుతుంది. ఈ పరిస్థితి అసలు ఎలా వచ్చింది. ఉన్నత అధికారులు ఎందుకు కట్టడి చేయలేకపోయారు. కొందరు స్థానికులు గతంలో తమకు అనేక ఇబ్బందులు ఎదురయ్యాయని ఆరోపించినట్లు సమాచారం.

### ఖాకీపై నమ్మకాన్ని నిలబెట్టేది జవాబుదారీతనమే

కీసర ఏసీబీ కేసు దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో లంచం ఆరోపణలపై చట్టపరమైన ప్రక్రియ ఒకవైపు, పోలీస్ శాఖలో అంతర్గత పర్యవేక్షణ (స్పెషల్ బ్రాంచ్ వైఫల్యం) పై సమీక్ష మరోవైపు సాగాల్సిన అవసరం కనిపిస్తోంది. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన వ్యవస్థపై నమ్మకం నిలవాలంటే.. ఆరోపణలు వచ్చిన ప్రతిసారీ అవి  ఎక్కడి నుంచి వచ్చాయి.? పోలీసు శాఖలో అధికారులపై వస్తున్న ఫిర్యాదులు, ఆరోపణలు పూర్తిస్థాయి విచారణ చేయించి అధికారుల, అవినీతి, నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం అని తేలితే వెంటనే సస్పెండ్ తో పాటు కఠిన చర్యలు తీసుకుంటే తప్ప ప్రజలకు పోలీసు శాఖపై నమ్మకం ఏర్పడే పరిస్థితులు లేకుండా పోతున్నాయి. దీనిపై ప్రభుత్వం, ఉన్నత అధికారులు ఎలా స్పందిస్తారో అన్నదానిపై ప్రజలు నిరీక్షణలో ఉన్నారు.

# సిజేరియన్ చేశారా.. ప్రాణం తీశారా.?

- వైద్య నిర్లక్ష్యంపై బాలింత కుటుంబం సంచలన ఆరోపణలు
- ఆపరేషన్ సమయంలో సెల్‌ఫోన్ సంభాషణ జరిగిందంటూ ఫిర్యాదు
- ఆరోగ్యంగా ఆసుపత్రికి వెళ్లిన మహిళ.. నాలుగు రోజులకే మృతి
- చికిత్సలో ఏం జరిగిందో సమగ్ర విచారణతో తేల్చాలంటున్న కుటుంబ సభ్యులు

గుంటూరు(ప్రశ్న న్యూస్) బిడ్డను కంటానన్న ఆనందంతో ఆసుపత్రి గడప తొక్కిన ఆ కుటుంబానికి.. నాలుగు రోజులకే అంతులేని విషాదం ఎదురైంది. సిజేరియన్ అనంతరం తీవ్ర అనారోగ్యానికి గురైన బాలింత మృతి చెందడంతో వైద్యుల నిర్లక్ష్యమే కారణమా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చికిత్స సమయంలో చోటుచేసుకున్న పరిణామాలపై మృతురాలి కుటుంబ సభ్యులు తీవ్ర ఆరోపణలు చేస్తూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా సిజేరియన్ జరుగుతున్న సమయంలో వైద్యురాలు సెల్‌ఫోన్‌లో మాట్లాడినట్లు తమకు సమాచారం ఉందని, ఆపరేషన్ అనంతరం రోగి పరిస్థితి క్షీణించినా సరైన వైద్యం అందలేదని కుటుంబ సభ్యులు ఆరోపించారు.అయితే ఈ ఆరోపణలు ప్రస్తుతం కుటుంబ సభ్యుల ఫిర్యాదులో పేర్కొన్న అంశాలే. వైద్యుల నిర్లక్ష్యం జరిగిందా? చికిత్సలో ఏదైనా వైద్యపరమైన లోపం చోటుచేసుకుందా? అన్నది వైద్య రికార్డులు, ఆపరేషన్ వివరాలు, మరణానికి ముందు అందించిన చికిత్స, పోస్టుమార్టం/వైద్య నిపుణుల అభిప్రాయం, సంబంధిత అధికారుల విచారణలో తేలాల్సి ఉంది.ఆరోగ్యంగానే ఉన్నారని చెప్పారంటూ..కుటుంబ సభ్యుల ఫిర్యాదు ప్రకారం.. రమ్జాన్ బీకి గతంలో ఒక ఆడపిల్ల జన్మించింది. ప్రస్తుత గర్భధారణ సమయంలో కూడా వైద్య పరీక్షలు చేయించుకుంటూ వచ్చారు. గర్భిణి, శిశువు ఆరోగ్యంగా ఉన్నారని వైద్యులు చెప్పారని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఆగస్టు 4న నిర్వహించిన స్కానింగ్‌లోనూ పెద్దగా ఇబ్బందులేమీ లేవని చెప్పి, ఆగస్టు 14న ప్రసవం కోసం ఆసుపత్రిలో చేరాలని సూచించినట్లు తెలిపారు. ఎనిమిదో నెల నుంచే శిశువు ఎదురుకాళ్లతో ఉందని, సాధారణ ప్రసవానికి అవకాశం తక్కువగా ఉండటంతో సిజేరియన్ చేయాల్సి ఉంటుందని వైద్యులు చెప్పడంతో కుటుంబ సభ్యులు అంగీకరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

### ఆపరేషన్ సమయంలో సెల్‌ఫోన్?

ఆగస్టు 14న సిజేరియన్ నిర్వహించిన సమయంలో ఆసుపత్రిలో చోటుచేసుకున్న పరిణామాలపై కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేశారు. ఆపరేషన్ సమయంలో వైద్యురాలు సెల్‌ఫోన్ ద్వారా ఓ మహిళతో మాట్లాడినట్లు తమకు తెలిసిందని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. బిడ్డ ఆడపిల్ల అని, ఇతర విషయాలపై సంభాషణ జరిగిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణలకు సంబంధించి ఆపరేషన్ థియేటర్‌లో  వాస్తవంగా ఏం జరిగింది? ఎవరు అక్కడ ఉన్నారు? సెల్‌ఫోన్ వినియోగం జరిగిందా? జరిగితే ఏ సందర్భంలో? అన్న అంశాలు అధికారిక విచారణలో తేలాల్సి ఉంది.

### రెండు రోజులకే డిశ్చార్జి..

సిజేరియన్ అనంతరం బాలింత బలహీనంగా ఉన్నప్పటికీ రెండు రోజులకు మించి ఆసుపత్రిలో ఉంచకూడదని వైద్యులు చెప్పి ఆగస్టు 17న డిశ్చార్జి చేసినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఇంటికి వెళ్లిన తర్వాత ఆమెకు కడుపు విపరీతంగా ఉబ్బడం, తీవ్రమైన నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి సమస్యలు తలెత్తినట్లు తెలిపారు. ఆసుపత్రి వైద్యులను సంప్రదించగా ఉదయం తీసుకురావాలని చెప్పారని, అనంతరం ఆసుపత్రికి తీసుకెళ్లినప్పుడు ఇంజక్షన్ ఇచ్చి గ్యాస్ సమస్య కావచ్చని చెప్పినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

### అధిక రక్తస్రావం జరిగిందా?

చికిత్స అనంతరం ఆసుపత్రి సిబ్బందిలో ఒకరు ఆపరేషన్ సమయంలో అధిక రక్తస్రావం జరిగినట్లు చెప్పారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. అదే సమయంలో పరిస్థితి విషమించడంతో మరో ఆసుపత్రికి తరలించాల్సిన అవసరం ఏర్పడిందని పేర్కొన్నారు. ఈ దశలోనే రోగిని మరో ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నాలు జరిగాయని, అక్కడి వైద్యులు పరిస్థితిని పరిశీలించారని కుటుంబ సభ్యులు తెలిపారు.

### వెంటిలేటర్.. సీపీఆర్.. చివరకు విషాదం

కుటుంబ సభ్యుల వాదన ప్రకారం.. బాలింతను శ్రేష్ఠ ఆసుపత్రికి తీసుకెళ్లిన అనంతరం అక్కడి వైద్యులు చికిత్స అందించేందుకు ప్రయత్నించారు. అయితే అప్పటికే పరిస్థితి అత్యంత విషమంగా ఉందని వారు తెలిపారు. జోషిత ఆసుపత్రిలోనే గుండె స్పందన ఆగిపోయిందని, సీపీఆర్, వెంటిలేటర్ ద్వారా పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రయత్నించినట్లు తమకు చెప్పారని కుటుంబ



సభ్యులు పేర్కొన్నారు. చివరకు బాలింత మృతి చెందినట్లు తెలిపారు.

### 'బిడ్డ పుట్టింది.. తల్లి దక్కలేదు'

ఒకవైపు నవజాత శిశువు.. మరోవైపు తల్లిని కోల్పోయిన కుటుంబం. సంతోషంగా బిడ్డను తీసుకుని ఇంటికి వస్తుందని ఎదురుచూసిన కుటుంబానికి చివరకు విషాదమే మిగిలింది. తమకు జరిగిన నష్టానికి బాధ్యులు ఎవరో తేల్చాలని, చికిత్సలో లోపాలు ఉంటే సంబంధిత వారిపై చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

### విచారణతోనే నిజం వెలుగులోకి..

ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. సిజేరియన్ సమయంలో రోగి పరిస్థితి ఎలా ఉంది? ఆపరేషన్ రికార్డుల్లో ఏం నమోదైంది? రక్తస్రావం జరిగిందా? జరిగితే దానికి తీసుకున్న చర్యలేమిటి? డిశ్చార్జి సమయంలో రోగి ఆరోగ్య పరిస్థితి ఏమిటి? ఇంటికి వెళ్లిన తర్వాత తిరిగి ఆసుపత్రికి వచ్చినప్పుడు అందించిన చికిత్స ఏమిటి? మరో ఆసుపత్రికి తరలించే సమయానికి రోగి పరిస్థితి ఎలా ఉంది? అనే అంశాలపై వైద్యపరమైన నిపుణులతో సమగ్ర విచారణ జరిపితేనే మరణానికి అసలు కారణం స్పష్టమయ్యే అవకాశం ఉంది.కుటుంబ సభ్యులు చేసిన ఆరోపణలు నిజమా? లేక చికిత్సలో అనివార్యంగా చోటుచేసుకున్న వైద్యపరమైన సంక్లిష్టత వల్లే మృతి సంభవించిందా? అన్నది సంబంధిత వైద్య రికార్డులు, నిపుణుల నివేదికలు, అధికారిక విచారణలో తేలాల్సి ఉంది.

# యూపీఐ ఛార్జీలు వద్దు

- కేంద్రానికి మొబైల్ రిటైలర్ల విజ్ఞప్తి



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) యూపీఐ లావాదేవీలపై ప్రతిపాదిత మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) లేదా ఇతర అదనపు ఛార్జీల నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని ఆల్ ఇండియా మొబైల్ రిటైలర్స్ అసోసియేషన్ (ఏఐఎంఆర్ఏ) కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఇప్పటికే అత్యల్ప లాభాలతో వ్యాపారాలు నిర్వహిస్తున్నామని, ఈ అదనపు భారం తమ మనుగడను దెబ్బతీస్తుందని అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఏఐఎంఆర్ఏ లేఖ రాసింది. దేశవ్యాప్తంగా 1.50 లక్షల మందికి పైగా చిన్న, మధ్య తరహా మొబైల్, ఎలక్ట్రానిక్స్ రిటైలర్లకు తాము ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు అసోసియేషన్ తెలిపింది. తాము కేవలం 0.75% నుంచి 1.5% నికర లాభాలతో వ్యాపారాలు సాగిస్తున్నామని, ఇలాంటి పరిస్థితుల్లో యూపీఐ లావాదేవీలపై 0.4% ఎండీఆర్ విధిస్తే అది నేరుగా తమ లాభాలను హరిస్తుందని పేర్కొంది. ఉదాహరణకు, నెలకు రూ. 10 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు యూపీఐ లావాదేవీలు జరిపే రిటైలర్‌పై ప్రతి నెలా రూ.4,000 నుంచి రూ. 16,000 వరకు అదనపు ఆర్థిక భారం పడుతుందని వివరించింది.విక్రయాలు పడిపోవడం, నిర్వహణ ఖర్చులు పెరగడంతో మొబైల్ రిటైల్ రంగం ఇప్పటికే తీవ్ర ఒత్తిడిలో ఉందని అసోసియేషన్ తెలిపింది. దీనికి తోడు స్మార్ట్‌ఫోన్ల ధరలు కూడా విపరీతంగా పెరిగాయని, 2025లో రూ. 10,000కు లభించిన ఎంట్రీ–లెవల్ స్మార్ట్‌ఫోన్ ధర ప్రస్తుతం రూ. 17,000కు చేరిందని, 2026 డిసెంబర్ నాటికి ఇది రూ. 20,000కు పెరిగే అవకాశం ఉందని అంచనా వేసింది. ఈ నేపథ్యంలో చిన్న, మధ్య తరహా రిటైలర్లకు యూపీఐ ఎండీఆర్ నుంచి పూర్తి మినహాయింపు ఇవ్వాలని, తక్కువ ఖర్చుతో కూడిన డిజిటల్ చెల్లింపుల ప్రక్రియను కొనసాగించాలని ఏఐఎంఆర్ఏ ప్రభుత్వాన్ని కోరింది. ఫీజుల నిర్మాణంపై నిర్ణయం తీసుకునే ముందు వాణిజ్య సంఘాలతో సంప్రదింపులు జరపాలని విజ్ఞప్తి చేసింది.

# నకిలీ టికెట్ల ముఠాకు చెక్

## దసరాకు ముందు దుర్గమ్మ సేవల పేరుతో మోసం





విజయవాడ(ప్రశ్న న్యూస్) దసరా శరన్నవరాత్రుల వేళ భక్తుల రద్దీని ఆసరాగా చేసుకుని నకిలీ దుర్గమ్మ సేవా టికెట్లను విక్రయిస్తున్న మోసగాడిని విజయవాడ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. సోషల్ మీడియాలో నకిలీ టికెట్లను ప్రచారం చేస్తూ,ఞ= కోడ్‌ల ద్వారా నగదు చెల్లింపులు చేయాలని కోరుతున్నట్లు గుర్తించారు. దేవస్థానం రికార్డులతో పోల్చి చూడగా టికెట్లు నకిలీవని నిర్ధారణ కావడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాలతో 24 గంటల్లోనే నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.

### సేవా టికెట్ల పేరుతో వల

విజయవాడ శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో దసరా ఉత్సవాల నేపథ్యంలో ప్రత్యేక సేవలకు భక్తుల నుంచి డిమాండ్ ఉంటుంది. ఈ అవకాశాన్ని అనుకూలంగా మార్చుకునేందుకు నిందితుడు "ప్రత్యక్ష సేవ" తదితర సేవా టికెట్లను విక్రయిస్తున్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం చేసినట్లు పోలీసులు తెలిపారు. భక్తులను ఆకర్షించేలా నకిలీ టికెట్లను రూపొందించి, వాటిపై క్యూఆర్ కోడ్‌లు ఏర్పాటు చేశాడు. వాటి ద్వారా నగదు చెల్లింపులు చేయాలని కోరినట్లు వెల్లడించారు.అనుమానాస్పద టికెట్ లేదా ఆన్‌లైన్ మోసం ఎదురైతే వెంటనే దేవస్థానం అధికారులకు లేదా ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

# చిన్నారికి గుండె.. కొత్త జీవితం

## గుంటూరు నుంచి నాలుగు గంటల్లో తిరుపతికి తరలింపు..

## 27వ గుండె మార్పిడి విజయవంతం



తిరుపతి (ప్రశ్న న్యూస్)  టీటీడీ ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్ ఆధ్వర్యంలోని శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయ చికిత్సా కేంద్రంలో 27వ గుండె మార్పిడి శస్త్రచికిత్స విజయవంతమైంది. గుండె మార్పిడి కోసం ఎదురుచూస్తున్న 14 ఏళ్ల బాలికకు గుంటూరులో లభించిన దాత గుండెను రోడ్డుమార్గంలో సకాలంలో తిరుపతికి తరలించి వైద్యులు విజయవంతంగా మార్పిడి చేశారు.

**అవయవదానంతో ఆశాకిరణం** గుంటూరులోని కిమ్స్ ఆసుపత్రిలో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్‌డెడ్‌గా ప్రకటించిన 38 ఏళ్ల వ్యక్తి కుటుంబం అవయవదానానికి ముందుకొచ్చింది. వారి మానవతా నిర్ణయం మరో చిన్నారికి కొత్త జీవితాన్ని అందించింది. నాలుగు గంటల్లో తిరుపతికి..గుండెను తరలించేందుకు ఎయిర్ అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో టీటీడీ రవాణా విభాగం వాహనంలో సెప్టెంబరు 20న మధ్యాహ్నం 3 గంటలకు గుంటూరు నుంచి రోడ్డుమార్గంలో తరలించారు. ఎస్వీపీసీహెచ్‌సీకి చెందిన ఫిజీషియన్ అసిస్టెంట్ విజయ్, పెర్ఫ్యూషనిస్ట్ శ్యామ్‌బాబు గుండెతో పాటు ప్రయాణిస్తూ వైద్య బృందంతో నిరంతరం సమన్వయం చేశారు.సాయంత్రం 7 గంటలకు గుండె తిరుపతికి చేరుకుంది. వెంటనే వైద్య బృందం మార్పిడి ప్రక్రియను ప్రారంభించింది. సుమారు ఎనిమిది గంటలపాటు సాగిన సంక్లిష్ట శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. సమన్వయంతో విజయవంతం ఎస్వీపీసీహెచ్‌సీ డైరెక్టర్ డా. ఎన్. శ్రీనాథ్‌రెడ్డి సమన్వయంతో, చీఫ్ కార్డియాక్ సర్జన్ డా. దీపేష్ త్రివేది నేతృత్వంలో ఈ శస్త్రచికిత్స జరిగింది. కార్డియాక్ అనస్థీషియాలజిస్ట్ డా. మధు యాదవ్‌తోపాటు కార్డియాక్ సర్జన్లు, కార్డియాలజిస్టులు, ఇంటెన్సివిస్టులు, పెర్ఫ్యూషనిస్టులు, నర్సింగ్, ట్రాన్స్‌ప్లాంట్ బృందాలు సమష్టిగా కృషి చేశాయి. ప్రస్తుతం బాలిక వైద్యుల నిరంతర పర్యవేక్షణలో చికిత్స పొందుతోంది.దాత కుటుంబం మానవతా నిర్ణయం.. రవాణా బృందం సమయపాలన.. వైద్య నిపుణుల సమష్టి కృషి.. వెరసి ఓ చిన్నారి జీవితంలో కొత్త ఆశను నింపాయి. బ్రహ్మోత్సవాల రద్దీలోనూ అత్యవసర వైద్య సేవలను సమన్వయంతో అందించి గుండె మార్పిడిని విజయవంతం చేశారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588